₹ 10/-

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 10 పక్షపత్రిక సంచిక - 09

మే 1-15, 2019



## టర్నింగ్ పాయింట్ @100 (1919)


గాంధీ గ్రామాలు - ఆధునిక నగరాలు

కేంద్రీకృత దుష్పరిపాలన ఇంకెన్నాళ్ళు?

రాజకీయ పార్టీల్ని రద్దు చేస్తే తప్పేమిటట!




భవిష్యత్ తారలను తయారుచేసేదే నిజమైన విద్య






# ‘బాగు చేయకపోయినా నష్టం మాత్రం చేయకూడదు’... ప్రాథమిక పాలనా సూత్రాన్ని కూడా పాటించలేకపోయారు

తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు చేసిన ఘోర తప్పిదం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు తాము చేయని తపుకు శిక్ష అనుభవించారు. బాగా పనిచేస్తున్న వ్యవస్థను మెరుగుపరచటానికి బదులు తెలంగాణ ప్రభుత్వం నాశనం చేసింది. బాగు చేయకపోయినా, హాని మాత్రం చేయకూడదన్నది... వైద్యంలో, పాలనలో పాటించాల్సిన మొట్టమొదటి సూత్రం ! నిర్లక్ష్యపూరిత నిర్ణయాలకు ప్రజలు మూల్యం చెల్లిస్తారన్న సోయి ఉండాలి.”

\- లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

మే 1-15, 2019 సంపుటి - 10 సంచిక - 09


## లోపలి పేజీల్లో...


టర్నింగ్ పాయింట్ @100 (1919) ........... 5

భవిష్యత్తు గాంధీ గ్రామాల్లో లేదు ఆధునిక........... 17

స్థానిక స్వయంపాలన లేని కేంద్రీకృత ............. 21

రాజకీయ పార్టీల్ని రద్దు చేస్తే తప్పేమిటిట!.......... 24

అధికారోన్మాదం ఆవహించింది ! .................. 26

'ఉక్కు' చట్రానికి బీటలు ? .......................... 27

అధికారిక సేవాభాగ్యం................................ 29

(మీడియాలో) 'కీ' కామెంట్లు...........................31

భవిష్యత్ తారలను తయారుచేసేదే నిజమైన....... 33





మీరు ప్రకటించిన ఆస్తులు పాత నోట్లా? కొత్తనోట్లా సార్?



అబ్బే! కిడ్నాప్ కాదు పార్టీ మారబోతుంటే పట్టుకుని పార్టీ ఆఫీసుకు లాక్కుపోతున్నాడు!

# కార్టూన్ కార్నర్


### సంపాదక వర్గం

**డా।। జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

బండారు రామ్మోహన్‌రావు
డా।। ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు


## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.


**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ప్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com


## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తాటైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుము "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836,* **SBI** *పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

IFSC No: SBIN0020072

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజీ | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి


FOLLOW ME ON
twitter
Friends, Interacting with youngsters always gives me immense pleasure. You can tweet your suggestions , ideas , queries to :
@JP_LOKSATTA
I will try to respond to as many as possible
DR.JAYAPRAKASH NARAYAN, FOUNDER, LOKSATTA



# టర్నింగ్ పాయింట్ @ 100 (1919)

**ఈ** ఏడాది గాంధీజీ 150వ జయంతి సంవత్సరం. ఆయనలోని మహాత్ముడి స్థాయి నాయకత్వ శక్తిని రగిల్చి 'మేకింగ్ ఆఫ్ మహాత్మా'కు పునాది వేసిన దక్షిణాఫ్రికా పీటర్‌మారిట్జ్‌బర్గ్ రైల్వేస్టేషన్ ఘటన జరిగి దాదాపు 125 ఏళ్లు అయింది. ఇదేసమయంలో, మహాత్ముడికి సంబంధించిన మరో మైలురాయిని కూడా ఈ ఏడాది మనకు గుర్తుచేస్తోంది. అది తన 'సత్యాన్వేషణ రాజకీయాని'కి భారతదేశ స్వాతంత్ర్యాన్ని గాంధీజీ మార్గంగా చేసుకోవటం!

1919 రౌలట్ చట్టం, సైనిక పాలన, జలియన్‌వాలాబాగ్ దురంతాల నేపథ్యంలో బ్రిటీష్‌వారి పాలన నుంచి భారత్‌ను విముక్తి చేయటం అవసరమని గాంధీజీ ఎటువంటి ఊగిసలాటలు లేకుండా నిర్ద్వంద్వంగా నిర్ణయించుకున్నారు. సత్యాన్వేషణ రాజకీయం.. అనే తన దీర్ఘకాలిక లక్ష్యానికి, స్వాతంత్ర్యమనే తక్షణావసరాన్ని ఆయన చక్కగా ముడివేయగలిగారు. గాంధీజీ లక్ష్యానికి అందుబాటులో ఉన్న మిగతా అన్నిటికంటే స్వాతంత్ర్యోద్యమం శక్తిమంతమైన సాధనంగా ఉపయోగపడింది. దీంతో

**ఆయన వేగంగా పురోగమించగలిగారు. 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చేనాటికి ఆయన బహుముఖ కృషి వల్ల జాతి నిర్మాణానికి పునాది పడి స్వతంత్ర భారతదేశం మనుగడ సాగించగలదనే భరోసా లభించింది. గాంధీ గారు లేకున్నా దేశానికి స్వతంత్రం వచ్చి ఉండేది, కానీ ఆయన స్వతంత్రం అనే మార్గం ద్వారా తన సత్యాన్వేషణ రాజకీయం చేయకుండా ఉంటే.. బ్రిటీషువారు స్వాతంత్ర్యం ప్రకటించేనాటికి కొన్ని ఉమ్మడి విలువలు పునాదిగా జాతి నిర్మాణం జరిగేదా, జాతీయతా భావం రూపుదిద్దుకునేదా అన్నది సందేహాస్పదం. ఈవేళున్నరీతిలో స్వతంత్ర భారతదేశ మనుగడ కూడా సాధ్యమయ్యేది కాదు. గాంధీ కృషికి అంబేద్కర్ నేతృత్వంలో రూపొందిన రాజ్యాంగం తోడై దేశం నిలదొక్కుకుంది. అందుకనే 1919 మన దేశానికి ఒక టర్నింగ్ పాయింట్.**

**స్వాతంత్ర్యోద్యమంలో, దేశ చరిత్రలో 1919 అనే టర్నింగ్ పాయింట్ ఈ ఏడాది వందేళ్ల మైలురాయిని దాటటం కేవలం ఒక సాంకేతిక సందర్భం కాదు. తాను వేసిన జాతి నిర్మాణం ఎంత అసంపూర్ణంగా ఉందో 1947లో దేశ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా తన కన్నీటి ద్వారా గాంధీజీయే చెప్పారు. ఇప్పటికీ ఆ అసంపూర్ణత కొనసాగుతూనే ఉందని 2019 ఎన్నికల్లో జాతీయత, కులం, మతం, హింస, అసత్యాల చుట్టూ సాగుతున్న ఓట్ల వేట రుజువు చేస్తోంది. అందుకే 150, 125 సందర్భాలతోపాటు 1919 టర్నింగ్ పాయింట్100 ఏళ్లను ఈవేళ మనం కొంత ఆలోచనతో జరుపుకోవాలి. ఆ దిశగా ప్రయత్నమే ఇది..**



దక్షిణాఫ్రికా నుంచి గాంధీజీ 1915 జనవరిలో భారత్‌కు తిరిగొచ్చారు. న్యాయవాదిగా కాదు.. సత్యాన్వేషణ రాజకీయవాదిగా!

న్యాయవాదిగా ఆదాయం కోసం దక్షిణాఫ్రికాకు వెళ్లిన మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ ఇండియాకొచ్చి స్థిరపడాలని కొన్ని గట్టి ప్రయత్నాలు చేశారు. కానీ ఇక్కడ ఆయనకంత ఆదాయం లభించలేదు. దీంతో లాభసాటిగా ఉన్న దక్షిణాఫ్రికాలోనే ఉండాల్సివచ్చింది. అయితే అక్కడి పరిస్థితులు, భారతీయుల పట్ల వివక్ష ఆయనలోని మహాత్ముడ్ని మేల్కొలిపాయి. సత్యాగ్రహం, అహింస మార్గాలతో ఆఫ్రికాలో పరిమిత ప్రజానీకం తరపున సాధించిన విజయాలు గాంధీజీ దృష్టిని స్వదేశంలోని విస్తృత ప్రజానీకం వైపు మళ్లించాయి. కోట్ల మంది భారతీయులకు ప్రతినిధిగా రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యం మీద పోరాడే నాయకత్వ పటిమ ఆయనకు ఆరోజు లేకపోవచ్చు. కానీ ఆ నాయకత్వాన్ని అందించేందుకు కావలసిన సరంజామా, అనుభవం తనలో నిండుగా ఉన్నాయన్న పూర్తి ఆత్మవిశ్వాసం ఆయనకుంది. అందుకే తాను న్యాయవాదిగా విఫలమైన దేశంలో నాయకుడిగా విజయం సాధించేందుకు 1915లో రీఎంట్రీ ఇచ్చారు. మళ్లీ దక్షిణాఫ్రికాకు వెళ్లాల్సిన అవసరం లేకుండా శిఖరప్రాయ నేతగా ఇక్కడే కొనసాగారు.

భారత్‌లో తన అహింసాయుత పోరాటానికి ముందు తాను గురువుగా భావించే గోపాలకృష్ణ గోఖలేని గాంధీజీ కలుసుకున్నారు. దక్షిణాఫ్రికాలో ఎంత అనుభవమున్నా, ఇండియాలో ఉన్న సువిశాలత, వైవిధ్యం దృష్ట్యా ఒక్కసారి భారత దర్శనం చేయమని, అన్ని ప్రాంతాల, వర్గాల ప్రజల్ని కలుసుకోమని గోఖలే సూచించారు. దాన్ని ఆచరణలో పెట్టే క్రమంలో గాంధీజీ మరింత రాటుదేలారు. ఒక్క ఏడాదిపాటు దేశమంతా తిరిగి చూస్తే మీ భావాలు వాటంతటవే త్రోవకు వస్తాయి. అని గోఖలే హింద్ స్వరాజ్‌లో తాను ప్రకటించిన విషయాలను ఎగతాళి చేసినట్లు గాంధీజీ రాశారు. కానీ 1915 సమయంలో తన మౌలిక సిద్ధాంతాలతో ప్రచురించిన 'హింద్ స్వరాజ్' పుస్తకంలో పేర్కొన్న అంశాలను మార్చుకోవాల్సిన అవసరం రాలేదని గోఖలేతో సమావేశం, భారత దర్శనం, ఆ తర్వాత చంపారన్ రైతుల, ఖేడా సత్యాగ్రహోద్యమాలు మొదలైన కార్యక్రమాల తర్వాత గాంధీజీ

ప్రకటించుకున్నారు. గాంధీగారి మౌలిక ఆలోచనల్లో మార్పు రాకపోయినా.. భారత పర్యటన, పౌర నేతలతో, ప్రజలతో సంభాషణలు ఆయన నాయకత్వ నైపుణ్యాల్ని అనేకరెట్లు విస్తరించాయన్నది వాస్తవం.

**తన ముందుతరాల కృషిని అందు కుంటూ భారత్‌లో 'సత్యాన్వేషణ రాజ కీయాని'కి శ్రీకారం**

గాంధీ గారొచ్చేమీ భారతదేశంలో జాతీయోద్యమాన్ని రగల్చలేదు. అప్పటికే ఒక దశకు వచ్చిన పునాది మీద ఆయన నిలబడి తన పోరాటాన్ని ప్రారంభించారు.

బ్రిటీషువాళ్లు 18వ శతాబ్దపు మధ్యకాలం నుంచి భారత ఉపఖండం మీద రకరకాల రూపాల్లో వరుసగా యుద్ధాలు చేస్తూ ఆక్రమిస్తూ వచ్చారు. భారత్‌పై ఎంత అణచివేతను, సైనికశక్తిని బ్రిటీషర్లు ప్రయోగిస్తున్నా, భారతీయుల్లోకి ఆత్మన్యూనతను ఎక్కిస్తున్నా కూడా ప్రజల్లో అసంతృప్తిని మాత్రం ఆపలేకపోయారు. ఈ క్రమంలోనే 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటు మొదటిసారిగా వలసపాలకుల ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీసింది. ఉత్తర భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో తిరుగుబాటు జరిగినా, తెల్లవాళ్లు పకడ్బందీగా అణచివేశారు. ఈ తిరుగుబాటే ఆ తర్వాత దేశ ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంగా గుర్తింపు పొందింది. అనంతరం 1897లో బ్రిటీషు ఉన్నతాధికారి డబ్ల్యు.సి రాండ్ హత్య వంటి ఘటనలు ఉన్నా.. 1905లో బెంగాల్ విభజన భారతీయులను కుదిపేసిన పెద్ద ఘటనగా చెప్పొచ్చు. బెంగాల్ విభజన భారత్‌లో అతివాద ఉద్యమాలకు దారితీసింది. 1911లో బెంగాల్ విభజనను ఉపసంహరించుకున్నా విప్లవకారులు వెనక్కు తగ్గలేదు. 1913లో శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉంటున్న అతివాద విప్లవకారులు గదర్ పత్రికను ప్రచురించారు. ఆ మరుసటి ఏడాదే 6,000 మంది సభ్యులతో గదర్ పార్టీ ఏర్పాటయింది. ఉత్తర అమెరికా, ఐరోపా, ఆసియా దేశాల్లో నెట్‌వర్క్‌తో ఈ పార్టీ పనిచేసింది. సిపాయిల తిరుగుబాటు తరహాలో బ్రిటీషు ప్రభుత్వాన్ని కూల్చాలని, వైస్రాయ్‌ని హత్య చేయాలని ప్రయత్నాలు జరిగాయి. వీటన్నిటినీ వలస ప్రభుత్వం అణచివేసింది. ఇలా దేశంలో బ్రిటీషువారికి వ్యతిరేకంగా బలమైన అభిప్రాయం ఏర్పడుతూ తెల్లోళ్ల ప్రభుత్వాన్ని కూల్చివేయటానికి పటిష్టమైన సమీకరణలు జరుగుతున్న తరుణంలో గాంధీజీ దక్షిణాఫ్రికా నుంచి వచ్చి జాతీయోద్యమంలోకి ప్రవేశించారు.

**దేశ స్వాతంత్ర్యం పట్ల కన్నా స్వయం పాలన దిశగా ప్రజల్లో పరివర్తన పట్లే ఆసక్తి**

అతివాద విప్లవ చర్యల పట్ల తన వ్యతిరేకతను గాంధీజీ మొదటి నుంచీ స్పష్టంగా, నిర్మొహమాటంగా ప్రకటిస్తూ వచ్చారు. అలాగని ఆయన బ్రిటీషు కులీన, దోపిడీ ధోరణులను కూడా సహించలేదు. భారతదేశ స్వాతంత్ర్యం నినాదం పట్ల, స్వాతంత్ర్యం ఎప్పుడొస్తుంది అనే అంశం పట్ల ఆయన పెద్ద ఆసక్తి చూపలేదు. స్వయంపాలనకు తగ్గట్లుగా భారతదేశం ఎదగలేకపోతే, అందుకు సిద్ధం కాలేకపోతే స్వతంత్రం వచ్చినా, రాకపోయినా తేడా ఏమీ ఉండదని భావించేవారు. అందుకే స్వయంపాలనకు తగ్గ పౌరబాధ్యతల్ని నెరవేర్చనందుకు ప్రజల్ని కూడా విమర్శించటానికి ఆయన జంకలేదు.

భారత్‌కు తిరిగొచ్చిన కొద్దికాలంలోనే 1916లో బనారస్ హిందూ విశ్వ విద్యాలయ సమావేశంలో గాంధీజీ చేసిన ప్రసంగాన్ని చూడండి. అందర్నీ కడిగేస్తున్నట్లు గంగా ప్రవాహంలా సాగుతున్న ఆయన ప్రసంగాన్ని తట్టుకోలేక కొందరు అతిథులు, ప్రముఖులు కుర్చీల్లో నుంచి లేచి వెళ్లిపోగా, కొందరు ఆయన ప్రసంగాన్ని అడ్డుకున్నారు. చివరకు భారత్‌లో తన తొలి ప్రధాన ప్రసంగాన్ని గాంధీజీ ఆరోజు మధ్యలోనే ఆపేయాల్సి వచ్చింది.

"కాగితాల్లో వక్కాణించటం ద్వారా మనకు స్వయంపాలన రాదు. ఎన్ని ప్రసంగాలైనా మనల్ని స్వయంపాలనకు తగురీతిలో సిద్ధం చేయలేవు. మన ప్రవర్తన మాత్రమే మనల్ని స్వయం పాలనకు అర్హులుగా తయారు చేస్తుంది. మనల్ని మనం పరిపాలించు కోవటానికి మనం ఏ విధంగా ప్రయత్నిస్తున్నాం మరి?" అని గాంధీజీ ఆనాటి సభలో ప్రశ్నించారు.

**ఉన్నతాధికారులను కూడా చెడగొట్టాం**

పెద్దమనుషులుగా ఉన్న ఉన్నతాధికారులను కూడా దిగజార్చే వాతావరణం దేశంలో ఉందని గాంధీజీ వేలెత్తిచూపారు.

"ఇండియన్ సివిల్ సర్వీస్‌లోని పలువురు సభ్యులు అహంకారపూరిత దార్ష్టీకాలకు పాల్పడుతుంటారని నిస్సంకోచంగా చెప్పొచ్చు. వాళ్లు క్రూరంగా, కొన్నిసార్లు మతిలేకుండా వ్యవహరిస్తారు. వారి వ్యవహారశైలిపై ఇలా అనేక విశేషణాల్ని ఉపయోగించవచ్చు. ఈ విషయాలన్నిటితోపాటు ఇంకోటి కూడా మనం గుర్తించాలి. భారత్‌లో కొన్నేళ్లపాటు గడిపాక వారిలో కొందరు కొంతమేర దిగజారిపోయారు. అది దేన్ని సూచిస్తోంది? ఇక్కడకు రాకముందు వాళ్లు పెద్దమనుషులు. ఇక్కడికొచ్చాక వాళ్లు తమ నైతికతను కొంత కోల్పోయారంటే, అది మనం కూడా ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అంశం.

మీరే ఆలోచించండి, నిన్న మంచిగా ఉన్న వ్యక్తి నాతో కలిసున్నాక చెడ్డగా మారాడంటే, అతను దిగజారిపోవటానికి అతనే కారణమా? నేనా కారణం?.. భారత్‌లోకి అడుగుపెట్టాక వాళ్లను చుట్టుముట్టే స్వార్థపూరిత పొగడ్తలు, తప్పుడు ధోరణులు వారిని దిగజారుస్తున్నాయి. ఆ స్థితిలో మనలో చాలామంది కూడా అలాగే అవుతారు. కొన్నిసార్లు నిందను తీసుకోవటం మంచిది. మనం స్వయంపాలనను అందుకోవాలంటే, నిందను స్వీకరించక తప్పదు" అని గాంధీజీ తన బనారస్ ప్రసంగంలో అన్నారు.

ఇంత తీక్షణంగా సత్యాగ్రహాన్ని గాంధీజీ ప్రకటించినా, విద్యార్థులు ఆయన మాటలకు జేజేలు పలికినా, నెలలు తరబడి ఆయన ప్రసంగం గురించే సమాజంలో మాట్లాడుకున్నా.. తన సత్యాహింసల ఆయుధాన్ని, ప్రజల్లో తనకు పెరుగుతున్న మద్దతును బ్రిటీషు వారికి వ్యతిరేకంగా మళ్లించేందుకు ఆయన పెద్దగా ప్రయత్నించలేదు. బ్రిటీషువారిని తరిమికొట్టి దేశానికి స్వాతంత్ర్యం తేవటంకన్నా.. స్వతంత్ర భారతదేశానికి తగిన అర్హతల్ని భారతీయులు సంతరించుకునేలా సంస్కరించటమే ముఖ్యమన్నట్లు గాంధీజీ సామాజిక రాజకీయం చేశారు. "సామ్రాజ్య పాలిత ప్రజలందరినీ తమతో సమానస్థాయికి అభివృద్ధి పరచడం ఆంగ్లజాతి విద్యుక్త ధర్మం" అని 1908లో దక్షిణాఫ్రికా జోహెన్నెస్‌బర్గ్ వైఎంసీఏలో చేసిన ఒక ఉపన్యాసంలో చెప్పిన మాటల చుట్టూనే ఇండియాలో ఆయన కార్యాచరణ కొనసాగింది. 'బ్రిటీష్ సామ్రాజ్యానికి ఆసియావాసులు, నల్ల జాతి ప్రజల నుంచి ముప్పు వాటిల్లనున్నదా?' అనే అంశంపై చర్చలో పాల్గొంటూ ఆయన ఆ ఉపన్యాసం చేశారు.

ఆఫ్రికన్ల, ఆసియన్ల శ్రమతో బ్రిటీష్ సామ్రాజ్యం నిర్మితమైందని, భారత్‌ను విస్మరించి బ్రిటీష్ సామ్రాజ్యం గురించి మాట్లాడం ఎవరికీ సాధ్యం కాదని ఆనాటి సభలో గాంధీజీ అన్నారు. ఇంత తీవ్రతతో తప్పుల్ని ఎత్తిచూపుతూ కూడా, బ్రిటీషు వారి నుంచి స్వాతంత్ర్యాన్ని సముపార్జించటం తక్షణ ప్రాధాన్యతాంశంగా గాంధీజీ భావించలేదు.

సమస్యలపై వలస పాలకులకు అర్జీలు పెట్టుకోవటం, తమకూ పాలనలో ఎంతో కొంత ప్రాధాన్యమివ్వాలని విన్నవించుకోవటం వంటివి గాంధీజీ వచ్చేటప్పటికే జరుగుతున్నాయి. ఇలాంటి నేతల కోసమే 1917–18లో మాంటేజ్–షెమ్స్‌ఫర్డ్ పేరుతో కొన్ని రాజకీయ సంస్కరణల్ని బ్రిటీష్ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ చిన్న చిన్న సంస్కరణలతో గాంధీజీ సంతృప్తి చెందనప్పటికీ, దేశ స్వాతంత్ర్యం ఆయన తక్షణ ప్రాధాన్యత కాలేదు. చంపారన్ సత్యాగ్రహంలో కూడా బ్రిటీషు వారితో సమన్వయం ద్వారానే, వారి వ్యవస్థ పరిధిలోనే నీలిమందు రైతులకు పరిష్కారాల్ని సాధించాలని గాంధీజీ ప్రయత్నించారు. దేశ ప్రజల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంచేందుకు, స్వయం పాలనకు కావలసిన పునాదిని వేసేందుకు గాంధీజీ అత్యధిక ప్రాధాన్యతనిచ్చి పనిచేశారు. గాంధీజీ దృష్టిలో స్వయంపాలన అంటే.. మారుమూల పల్లెలో ఉంటున్న చిట్టచివరి పౌరునికి కూడా తన జీవితం మీద తనకు పట్టుండాలి. మాతృభాషలో విద్యను నేర్చుకుంటూ తన జీవితం గురించి ఎక్కడో కూర్చున్న ఎవరో నిర్ణయాలు తీసుకోవటం కాకుండా, తానే తీసుకోగలగాలి. తన నష్టమొచ్చే నిర్ణయాల్ని సరిదిద్దుకునే అవకాశం ఆ వ్యక్తికి ఉండాలి. ఈ రకమైన స్వయంపాలన గనక భారతదేశంలో వస్తే, అప్పుడు బ్రిటీషువాళ్లు మనదేశంలోనే ఉన్నా, వెళ్లిపోయినా మనకొచ్చే నష్టమేమీ ఉండదు, దేశ స్వాతంత్ర్యమనేది అప్పుడసలు సమస్యే అవదని గాంధీజీ భావించారు. బ్రిటీషువారి నుంచి స్వాతంత్ర్యాన్ని చేజిక్కించుకోవటం కంటే.. ఉమ్మడి విలువల ప్రాతిపదికన భారతదేశ ప్రజల్లో స్వయంపాలనకు అవసరమైన పరివర్తనను సాధించటవే తొలి ప్రాధాన్యతగా గాంధీజీ తన కార్యక్రమాల్ని ఇండియాకు తిరిగొచ్చిన తొలి నాలుగేళ్ల పాటు కొనసాగించారు.

## రౌలట్ చట్టం - టర్నింగ్ పాయింట్

అప్పుడే టర్నింగ్ పాయింట్ వచ్చింది. అది 1919.

దీనికి నేపథ్యం 1914లో మొదలైన మొదటి ప్రపంచ యుద్ధం. ఈ యుద్ధం తర్వాత ఇక యుద్ధాలుండవని, భారతీయులు ఈ యుద్ధానికి మద్దతిస్తే పాక్షిక స్వయంప్రతిపత్తి ఇస్తామని బ్రిటీష్ పాలకులు ఆశ చూపారు. దీంతో పలువురు యుద్ధంలో పాల్గన్నారు. భారతీయ సైనికులు వేలసంఖ్యలో ప్రాణాలర్పించారు. అయితే కొందరు జాతీయోద్యమకారులు, ఇతర దేశభక్తులు మాత్రం యుద్ధానికి ఇండియా మద్దతివ్వటాన్ని వ్యతిరేకించారు. ఇలాంటి వారిని అణచివేయడానికి 1915లో భారత రక్షణ చట్టాన్ని చేశారు. 1918లో ప్రపంచయుద్ధం ముగిసింది. భారతీయ సైనికుల్లో ఎక్కువమంది వరస కరవుల బారిన పడిన పంజాబ్ నుంచి ఉన్నారు. యుద్ధం ముగిసినా స్వయంపాలన దిశగా ప్రతిపత్తిని కల్పించే చర్యలు లేకపోవటం,

కరవుకు తోడు యుద్ధానంతర ద్రవ్యోల్బణం వల్ల ధరలు పెరగటం, యుద్ధంలో ఎక్కువమంది పంజాబీలే మరణించటం, గాయపడటం, పీల్చిపిప్పి చేసేలా పన్నుల్ని వసూలు చేయటం వంటి కారణాలతో ఆ ప్రాంతం అట్టుడక సాగింది. ఈ నేపథ్యంలో తిరుగుబాటు ధోరణుల్ని అణచటానికి, ప్రభుత్వ వ్యతిరేకులపై ఉక్కుపాదం మోపటానికి బ్రిటీష్ న్యాయమూర్తి సిడ్నీ రౌలట్ నేతృత్వంలో 1918లో 'సెడిషన్ కమిటీ'ని ఏర్పాటు చేశారు. జర్మన్, బోల్షివిక్ విప్లవ కారులతో భారతీయుల సంబంధాలను బైటికి తీయటం కూడా కమిటీ విధుల్లో ఒకటి. ఈ క్రమంలో ఏర్పడిందే 1919 నాటి రౌలట్ చట్టం. దీనికి 'అరాచక, విప్లవ నేరాల చట్టం'గా పేర్కొన్నారు. ఢిల్లీలోని ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్ 1919, మార్చి 10న ఈ చట్టాన్ని ఆమోదించింది. దీని కింద పౌరులను ఏమాత్రం అనుమానం కలిగినా వారంట్ లేకుండానే తనిఖీ చేయవచ్చు, అరెస్టు చేయవచ్చు, ఎన్నిరోజులైనా బందిఖానాలో ఉంచవచ్చు, న్యాయసమీక్షకు కూడా అవకాశం ఉండదు. ఉగ్రవాది అనే అనుమానంతో విచారణ లేకుండా రెండేళ్లపాటు బ్రిటీష్ ఇండియాలో ఏ పౌరుడినైనా నిర్బంధించవచ్చు. పత్రికల మీద ఆంక్షలు అమలుచేయవచ్చు. అంతకుముందు యుద్ధసమయంలో ఉన్న భారత రక్షణ చట్టానికి నకలులా రౌలట్ చట్టం ఉంది. ఆనాటి రక్షణ చట్టానికి కాలం చెల్లటంతో దీన్ని తీసుకొచ్చారు. నల్ల బిల్లు.. అంటూ నిరసనలు వ్యక్తమవుతున్నా, లెక్క చేయకుండా ఢిల్లీ సభ ఈ చట్టాన్ని ఆమోదించింది.

ఈ అణచివేతే గాంధీజీ చేత పెద్ద అడుగులు వేయించింది. భారతీయులకు స్వయంపాలనను అలవరచాలన్న ఆయన సంకల్పాన్ని విస్తృతం చేసి తక్షణ లక్ష్యంగా కొత్త దృశ్యాన్ని ఆయనకు ఆవిష్కరింప చేసింది. అతివాద చర్యలకు పాల్పడుతున్నవారి దేశభక్తికి తాను దాసోహమవుతానని, అదేసమయంలో వారి హింసాత్మక చర్యలను తాను సహించనని అనేక సందర్భాల్లో ప్రకటించినా కూడా.. అతివాద విప్లవకారుల్ని కట్టడి చేసేందుకు తీసుకొచ్చిన రౌలట్ చట్టాన్ని గాంధీజీ తీవ్రంగా నిరసించారు. అప్పటికి గాంధీజీ ఆరోగ్యం కూడా సక్రమంగా లేదు. యుద్ధంలో బ్రిటీషర్లకు ఏకవాక్యంలో మద్దతు తెలిపి, వారికి సైనిక రిక్రూట్‌మెంట్ చేసే క్రమంలో ఆయన ఆరోగ్యం దెబ్బతింది. ఆ రిక్రూట్‌మెంట్ కోసం ఆయన విపరీతంగా కష్టపడాల్సి వచ్చింది.

**డబ్బు ఇచ్చినా బండి కట్టేవాళ్లు కన బడలేదు**

"సైన్యంలో యువకుల్ని చేర్చడం నా రెండో బాధ్యత. ప్రజల్ని సైన్యంలో చేరమని నేను విన్నపం చేయాలంటే అందుకు తగినచోటు ఖేడాయే గదా? నా అనుచరుల్ని ఆహ్వానించకపోతే ఇంక ఎవర్ని ఆహ్వానించగలను? ఖేడా చేరగానే వల్లభభాయి మొదలగువారితో చర్చించాను. చాలామందికి నా మాటలు రుచించలేదు. రుచించినవారికి ఇందు సాఫల్యం లభిస్తుందా అని సందేహం కలిగింది. ఏ వర్గం వారిని ఇందు చేర్చాలో ఆ వర్గంవారికి ప్రభుత్వం మీద విశ్వాసం లేదు. అయినా పని ప్రారంభిద్దామని అంతా నిర్ణయానికి వచ్చారు. పని ప్రారంభించినప్పుడు నా కండ్లు తెరుపుడు పడ్డాయి. నా ఆశావాదం తగ్గిపోయింది. ఖేడా సంగ్రామం జరిగినప్పుడు జనం తమ సొంత బండ్లను ఇచ్చారు. ఒక్క వాలంటీరుతో పని జరిగే చోట నలుగురు వాలంటీర్లు పనిచేశారు. కానీ ఇప్పుడు డబ్బు ఇచ్చినా బండి కట్టేవాళ్లు కనబడలేదు. అయితే మేము నిరాశపడే రకం కాదు గదా! బండ్లకు బదులు కాలినడకన తిరగాలని నిర్ణయించాం. రోజుకు 20 మైళ్లు నడవాల్సి వచ్చింది. బండి దొరకని చోట తిండి ఎలా దొరుకుతుంది? భోజనం పెట్టమని అడగటం మంచిది కాదు గదా! అందువల్ల ప్రతి వాలంటీరు బయలుదేరినప్పుడే ఆహారం వెంట తెచ్చుకోవాలని నిర్ణయించాం. వెళ్లిన ప్రతి గ్రామంలో సభ జరిపాం. జనం వచ్చేవారు కానీ, ఇద్దరు ముగ్గురు మాత్రమే తమ పేరు నమోదు చేయించు కునేవారు. ఇట్టి స్థితిలో కూడా మెల్ల మెల్లగా పనిచేశాం. పేర్లు బాగానే నమోదు కాసాగాయి. కానీ సైన్యంలో యువకుల్ని చేర్చడం కోసం నా శరీరం అరిగి పోయింది. వేరుసెనగ పప్పు ఎక్కువగా తింటే హానిచేస్తుందని తెలుసు. అయినా దాన్ని ఎక్కువగా తిన్నాను. అందువల్ల విరోచనాలు పట్టుకున్నాయి'' అని గాంధీజీ తెలిపారు.

కోలుకుంటున్న సమయంలో రౌలట్ చట్టం గురించి తెలిసింది.

''అయితే రౌలట్ యాక్టును ఎదుర్కోవాలి! ఆ మోహం నన్ను వదల లేదు. అందువల్ల జీవించి ఉండాలనే కాంక్ష కలిగింది. ఆహార అలవాట్ల సంబంధంగా జీవితంలో మహత్తర ప్రయోగమని దేన్ని భావిస్తూ ఉన్నానో అది ఆగిపోయింది" అని తన ఆత్మకథ (సత్యశోధన)లో గాంధీజీ రాసుకున్నారు.

ఈ చట్టం స్వేచ్ఛ, న్యాయం వంటి మౌలిక సూత్రాలకు విరుద్ధమని, ఆత్మగౌరవం ఉన్నవారెవరూ ఇలాంటి చట్టాన్ని సహించరని ఆయన తన

సహచరులతో పేర్కొన్నారు. సత్యాగ్రహానికి సిద్ధమవ్వాలని భావించినా ఆరోగ్యం సహకరించకపోవటంతో పత్రికలకు వ్యాసాలు రాయటం ప్రారంభించారు. చివరకు క్షేత్రస్థాయిలో సత్యాగ్రహ కార్యాచరణను ఆరంభించాలని నిర్ణయించారు. అప్పటికి ఉన్న సంస్థల ద్వారా సత్యాగ్రహ పోరాటం సాధ్యం కాదని గుర్తించి, సత్యాగ్రహ సభ అనే సంస్థను ప్రారంభించారు. అప్పటికప్పుడు రూపొందించిన సత్యాగ్రహ ప్రతిజ్ఞ మీద గాంధీజీ, ఆయన సహచరులు సంతకాలు చేశారు. ఆ తర్వాత గాంధీజీ మద్రాసు వెళ్లారు. మొట్టమొదటిసారిగా సి.రాజ గోపాలాచారిని కలుసుకున్నారు. అక్కడ నేతలతో సమావేశంలో ఉండగానే, రౌలట్ చట్టాన్ని ప్రచురించారన్న వార్త వచ్చింది. దీంతో సత్యాగ్రహ ఉద్యమంలో భాగంగా దేశవ్యాప్త హర్తాళ్ చేయాలన్న నిర్ణయానికి సమావేశం వచ్చింది. తొలుత మార్చి 30ని హర్తాళ్ రోజుగా నిర్ణయించారు. ఆ తర్వాత ఏప్రిల్ 6కు మార్చారు. చాలా తక్కువ సమయంలో నేతలు హర్తాళ్ ప్రకటన చేసినా, ప్రజలు దీనికి గొప్పగా స్పందించారు. హోమ్‌రూల్ ఉద్యమం, ముస్లింలీగ్, ఇంకా పలు చిన్న సంస్థలు కూడా ఇందులో భాగస్వాము లయ్యాయి. ఢిల్లీ, లాహోర్, అమృత్‌సర్ వంటి చోట్ల మార్చి 30నే హర్తాళ్ పాటించారు. ఢిల్లీలో ప్రజలను కట్టడి చేసేందుకు పోలీసులు కాల్పులు జరిపారు. కొంతమంది మరణించారు, పలువురు గాయపడ్డారు. తర్వాత గాంధీజీ బొంబాయిలో ఏప్రిల్ 6న హర్తాళ్‌లో పాల్గన్నారు. ఇది పెద్ద విజయం సాధించింది. ఒక్క పరిశ్రమ చక్రమూ తిరగలేదు, ఒక్క దుకాణమూ తెరవలేదు. దేశవ్యాప్తంగా కూడా ప్రజలు హర్తాళ్ పాటించారు. ప్రభుత్వం ఎంత రెచ్చగొడు తున్నా శాంతియుతంగా హర్తాళ్ నిర్వహించాలని గాంధీజీ పదేపదే విజ్ఞప్తి చేశారు. అయినా ప్రజలు పలుచోట్ల ఎదురుదాడులకు దిగటంతో అహ్మదా బాద్, పంజాబ్ వంటి చోట్ల హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. వీటన్నిటినీ చూశాక గాంధీజీ ఖిన్నుల య్యారు. అహింస భావాన్ని ప్రజలు ఇంకా అర్థం చేసుకోవాలని భావించారు. ప్రతిఘటనను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ఆత్మశుద్ధి కోసం ఉపవాసం చేశారు. దీనిపై తీవ్ర విమర్శలు వచ్చినా ఆయన జంకకుండా తన నిబద్ధత కనుగుణంగానే వ్యవహరించారు.

రౌలట్ చట్టం తన కార్యాచరణలో ఎలాంటి మార్పును తెచ్చిందో గాంధీజీ ఆత్మకథలో ఈ విధంగా వివరించారు:

### మద్రాసులో నిర్ణయం - ప్రజల స్పందన ఓ అద్భుత దృశ్యం

"పక్క మీద నుండి (సైనిక రిక్రూట్‌మెంట్ సమయంలో అనారోగ్యం నుంచి) లేవగలననే ఆశ కలిగింది. పత్రికలు చదవడం ప్రారంభించాను. ఇంతలో రౌలట్ కమిటీ రిపోర్టు నా చేతికి అందింది. అందులో పేర్కొన్న సిఫార సులను చదివి నివ్వెరపోయాను. ఉమర్‌భాయి (సుభానీ), శంకరలాల్ ఈ విషయమైన గట్టి చర్య తీసుకోవాలని అన్నారు. ఒక నెలరోజులు గడిచిన తరువాత నేను అహమదాబాదు వెళ్లాను. వల్లభభాయి ప్రతి రోజు నన్ను చూసేందుకు వస్తూ ఉండేవారు. వారితో మాట్లాడి, దీన్ని గురించి ఏమైనా చేయాలి అన్నాను. 'ఏం చేయాలి?' అని ప్రశ్నించారు వల్లభభాయి. కమిటీ చేసిన సిఫారసుల ప్రకారం చట్టం చేయబడితే వెంటనే సత్యాగ్రహం ప్రారంభించాలి. అలా చేస్తామని ప్రతిజ్ఞ గైకొనేవారు కొందరైనా అవసరం అని చెప్పాను. నేను మంచం పట్టి ఉండకపోతే ఒంటరిగానే పోరాటానికి దిగేవాణ్ణి. తరువాత కొంతమంది అయినా పోరాటంలో చేరేవారు. శరీర దారుఢ్యత లేనందువలన ఒంటరిగా పోరాటానికి దిగగల శక్తి నాకు లేదు అని చెప్పాను. అభిమానం గల ఏ దేశమూ ఇట్టి చట్టాల్ని అంగీకరించదని స్పష్టంగా తేలిపోయింది.

రౌలట్ కమిటీ రిపోర్టుకు వ్యతిరేకంగా ఒకవైపున ఉద్యమం సాగుతూ ఉంటే మరోవైపున ప్రభుత్వం ఆ రిపోర్టును అమలు పరిచితీరాలనే నిర్ణయానికి వచ్చింది. రౌలట్ బిల్లు వెలువడింది. నేను కౌన్సిలు మీటింగులో రౌలట్ బిల్లు మీద జరిగే చర్చ విందామని ఒకసారి వెళ్లాను. నిద్రపోతున్నవాణ్ణి మేల్కొలపవచ్చు. కానీ నిద్ర నటించేవాడి చెవి దగ్గర శంఖం ఊదినా ప్రయోజనం ఏముంటుంది? కౌన్సిల్లో బిల్లుల మీద చర్చ జరిగినట్లు పెద్దనాటకం ఆడాలిగదా! ప్రభుత్వం ఆ పని చేసింది. వైస్రాయిని కలిసి అనేక విధాల చెప్పాను. జాబులు రాశాను. బహిరంగలేఖలు కూడా రాశాను. సత్యాగ్రహం తప్ప గత్యంతరం లేదని కూడా ప్రకటించాను. అంతా అడవిలో గాచిన వెన్నెల చందాన అయిపోయింది.

ఇంకా బిల్లు గెజట్‌లో ప్రకటించ బడలేదు. నా శరీరం బలహీనంగా ఉంది. అయినా పెద్ద పోరాటానికి నడుం బిగించాను. పెద్ద ప్రసంగాలు చేసే శక్తి ఇంకా నాకు చేకూరలేదు. నిలబడి మాట్లాడగల శక్తి ఎప్పుడో పోయింది. ఆ శక్తి ఇక ఈనాటి వరకు నాకు చేకూరలేదు. అయితే మద్రాసు నుంచి అందిన ఆహ్వానం అంగీకరించాలని భావించాను. దక్షిణాది ప్రాంతాలు నా స్వగృహాలు అనిపించేవి. శ్రీ రాజగోపాలా చార్యులతో ఇది నాకు ప్రథమ పరిచయమని చెప్పవచ్చు. యుద్ధ ప్రణాళిక

గురించి, రౌలట్ బిల్లు చట్టరూపం దాలిస్తే దాన్ని సవినయంగా ఎదుర్కొనే అవకాశం ప్రభుత్వం కల్పించనప్పుడు, ఆ పంథాకి హద్దులేమిటి? అని సమావేశంలో చర్చ జరిగింది.

ఇంతలో బిల్లు చట్ట రూపంలో గెజెట్‌లో ప్రకటించబడిందనే వార్త మాకు అందింది. ఈ వార్త అందిననాటి రాత్రి ఏం చేయాలా అని తీవ్రంగా ఆలోచిస్తూ నిద్రపోయాను. తెల్లవారు సమయంలో మెలకువ వచ్చింది. అర్ధనిద్రావస్థలో ఒక స్వప్నం వచ్చింది. అందులో ఒక సలహా వినబడింది. "ఈ చట్టానికి వ్యతిరేకంగా దేశమంతటా హర్తాళ్లు జరపమని ప్రకటన చెయ్యాలి. సత్యాగ్రహం ఆత్మశుద్ధికి సంబంధించిన యుద్ధం. అది ధార్మికయుద్ధం. ధర్మకార్యం. శుద్ధిగా ప్రారంభించాలి. అందువల్ల ఆ రోజున ఉపవాసం చేయాలి. పనులేవీ చేయకూడదు. ముస్లిం సోదరులు రోజా ఉపవాసం చేస్తారు గనుక 24 గంటల పాటు అంతా ఉపవాసం చేయాలి. అన్ని ప్రాంతాలవారు చేరుతారో లేదో తెలియదు. కనుక ముందుగా బొంబాయి, మద్రాసు, బీహారు, సింధ్‌లో జరపాలి. ఈ ప్రాంతాల్లో సరిగా హర్తాళ్ జరిగితే దానితో తృప్తి పడాలి". ఇదీ స్వప్నంలో నాకు వినబడిన సలహా. ఈ సలహా రాజగోపాలాచార్యులకు బాగా నచ్చింది. తరువాత ఇతర మిత్రులకు తెలియజేశాం. అందరూ హర్షం ప్రకటించారు.

ఆశ్చర్యం! ఎలా జరిగాయో ఏమో ఏర్పాట్లు పకడ్బందీగా జరిగాయి. హిందూ దేశమంతట పట్టణాల్లో, పల్లెటూళ్లలో జయప్రదంగా హర్తాళ్లు జరిగాయి. అద్భుతమైన దృశ్యం అది."

**మరుసటి ఆదివారమే జలియన్ వాలాబాగ్ మారణకాండ**

రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా ప్రజాందోళనలకు నాయకత్వం వహించిన నాయకుడి గురించి ట్రిబ్యూన్ పత్రిక ఇలా వ్యాఖ్యానించింది: "గాంధీలో భారతీయ మానవత ఉత్కృష్ట స్థాయికి చేరిందని గోఖలే ఒకసారి వ్యాఖ్యానించారు. ఈ దేశ ప్రజల గురించి గాంధీ అవగాహన పరిపూర్ణమైనది. అత్యంత ప్రజాదరణ గల నాయకుడు ఆయన. భారతీయ నాయకులలో రుషితుల్యుడు'. ఈ వ్యాఖ్య 1919 ఏప్రిల్ 6 (ఆదివారం) సంచికలో వెలువడింది. ఆ మరుసటి ఆదివారమే (ఏప్రిల్ 13) జలియన్‌వాలాబాగ్ మారణకాండ చోటు చేసుకుంది.

ఈ వరుస ఘటనల నేపథ్యంలో బ్రిటీషు పాలన నుంచి భారత్‌ను విముక్తి చేయటం తప్పనిసరి లక్ష్యంగా గాంధీజీ గుర్తించారు. సంపూర్ణ స్వరాజ్యం తప్ప మరేదీ ఆమోదయోగ్యం కాదని ప్రజానీకంతోపాటు ఆయన కూడా దృఢంగా భావించటం ప్రారంభించారు.

**చట్టానికి ముందు, తర్వాతా**

మొదటి ప్రపంచ యుద్ధంలో బ్రిటీష్ వారికి సాయం చేసినప్పటి తన ధోరణిలో మార్పు గురించి ఆ తర్వాత ఆత్మకథలో గాంధీజీ రికార్డు చేశారు.

సైన్యంలోకి ప్రజల్ని చేర్పించే సమయంలో, ఆ తర్వాతా గాంధీజీ ఆలోచనలు ఎలా మార్పు చెందాయో ఈ మాటల్ని చూస్తే అర్థమవుతుంది.

**రౌలట్ చట్టానికి ముందు యుద్ధ సమయంలో..**

ఖేడాలో సైన్యంలోకి ప్రజల్ని చేర్పించే కార్యక్రమం గురించి వైస్రాయికి పంపిన పత్రంలో గాంధీజీ ఇలా పేర్కొన్నారు: "భారతదేశం వచ్చినప్పటి నుండి సామాన్య ప్రజానీకంతో సంబంధం పెట్టుకున్నాను. వారి హృదయంలో కూడా హోంరూలును గురించిన ఆకాంక్ష నాటుకున్నదని మనవి చేయదలచుకున్నాను. హోంరూలు కోసం ఎంతటి త్యాగానికైనా ప్రజానీకం సిద్ధంగా ఉన్నది. రాజ్యరక్షణకు ఎంతమంది సైనికులనైనా మేము ఇవ్వవలసిందే. మేము గద్దెల కోసం గాని, మేడల కోసం గాని ఎగబడడం లేదు. మా సాయం భవిష్యత్తు మీద గల ఆశల పునాది మీద ఆధారపడి ఉన్నది. ఆ ఆశలు ఏమిటో స్పష్టంగా చెప్పడం అవసరమని భావిస్తున్నాను. నేను బేరసారాలకు దిగను. గృహ కల్లోలాలు మరచిపొమ్మని అన్నారు. దానికి అర్థం అధికారుల అకృత్యాలను మరచిపొమ్మనా? అధికారులకు దుర్మార్గాలు ఆపివేయమని, ప్రజాభిప్రాయాన్ని ఆదరించమని చెప్పండి. చంపారన్‌లో శతాబ్దాల తరబడి సాగుతున్న దుర్మార్గాల్ని ఎదుర్కొని బ్రిటీష్ వారి న్యాయవ్యవస్థ ఎంతగొప్పదో నిరూపించి చూపించాను. సత్యం కోసం కష్టాల్ని సహించగల శక్తి తమకు ఉన్నదని తెలుసుకున్న ఖేడా ప్రజలు వాస్తవానికి ప్రభుత్వ శక్తి ఒక శక్తి కాదని, ప్రజాశక్తియే నిజమైన శక్తియని గ్రహించారు. ఆ తరువాత అక్కడి ప్రజలు అప్పటివరకూ తాము శపిస్తున్న ప్రభుత్వం శక్తి పట్ల తమకు గల వ్యతిరేకతను తగ్గించుకున్నారు. అందువల్ల చంపారన్, ఖేడాలలో నేను జరిపిన చర్యలన్నీ యుద్ధ సమయంలో సహాయపడ్డాయని భావిస్తున్నాను. ఆయుధబలం కంటే ఆత్మబలం, అనగా ప్రేమ బలం గొప్పదను భావం ప్రజల హృదయాలలో నేను నాటగలిగితే భారతదేశం మొత్తం ప్రపంచానికే తలమానికం కాగలదని భావిస్తున్నాను. అందువల్ల ప్రతి వ్యక్తి కష్టాలు, దుఃఖాలు సహించగల శక్తిని అలవరచుకునే పద్ధతిన సనాతన విధానాన్ని జీవితంలో అనుసరించడం

కోసం నా ఆత్మశక్తి వినియోగిస్తాను. ఈ విధానాన్ని అనుసరించమని ఇతరులను కూడా ఆహ్వానిస్తూ ఉంటాను. ఇతర వ్యవహారాలలో తలదూర్చడం ఈ విధానం యొక్క గొప్పతనాన్ని రుజువు చేసేందుకేనని మనవిచేస్తున్నాను. ముస్లిం రాజ్యాల హక్కుల రక్షణ కోసం, వారి ధార్మిక స్థలాల విషయంలో, వారి భావాల్ని ఆదరించే విషయంలో, భారతదేశానికి హోంరూలు మొదలగు వాటిని అంగీకరించడం బ్రిటీషు సామ్రాజ్యానికి క్షేమం కలిగిస్తుందని మనవి చేస్తున్నాను. ఇంగ్లీషు వారిలో గల విశ్వసనీయతను ప్రతి భారతీయుని హృదయంలో నెలకొల్పాలని కాంక్షిస్తున్నాను."

### రౌలట్ చట్టం తర్వాత..

ఆ తర్వాత బ్రిటీషువారి అణచివేత విధానాల పరిణామాల నేపథ్యంలో గాంధీ ఇలా పేర్కొన్నారు: "మనం పూర్తిగా బానిసత్వంలో లేమనే అభిప్రాయంతో అప్పుడు నేను ఉన్నాను. అసలు ఆంగ్ల ప్రభుత్వ విధానంలో దోషం లేదని, దాన్ని అమలుపరుస్తున్న ఆంగ్ల అధికారుల్లో దోషం అధికంగా ఉన్నదని ప్రేమ ద్వారా ఆ దోషాన్ని తొలగించవచ్చని భావించాను. ఆంగ్లేయుల సాయంతో మన స్థితిని చక్కదిద్దుకోవాలని మనం భావిస్తూ ఉంటే ఆపద సమయంలో వారికి సాయం చేసి తద్వారా పరిస్థితిని చక్కదిద్దుకోవాలని అభిప్రాయపడ్డాను. రాజ్యవిధానం దోషమయంగా ఉన్నప్పటికీ ఆరోజుల్లో అది ఇప్పటివలెనే నాకు పెద్దదిగా కనబడలేదు. అయితే ఇప్పుడు ఆంగ్ల రాజ్య విధానం మీద విశ్వాసం నాకు పూర్తిగా సడలిపోయింది. అందువల్ల ఇప్పుడు నన్ను సాయం చేయమంటే చేయలేను. అదేవిధంగా ఆంగ్ల రాజ్య విధానం మీద, ఆంగ్ల అధికారుల మీద పూర్తిగా విశ్వాసం నన్నగిల్లిపోయినవారిని సాయం చేయమంటే చేస్తారా? సాధ్యమా?".

### నా పోరాటపంథా వల్లే జలియన్ వాలాబాగ్ దురంతం అని విమర్శించినా జంకను

సహాయ నిరాకరణ ఉద్యమానికి నాందిగా తాను ప్రారంభించిన సత్యాగ్రహ హర్తాళ్‌ను మధ్యలో నిలిపివేయటంపై విమర్శలను గాంధీజీ లెక్కచేయలేదు. ఎంత తీవ్రమైన సన్నివేశమైనా, పరిస్థితులైనా తన సత్యాన్వేషణ రాజకీయాలకు ఆటంకమవుతుందనుకుంటే.. గాంధీజీ ఆపుచేసేవారు. జలియన్‌వాలాబాగ్ హత్యాకాండకు తన పోరాటపంథాయే కారణమంటూ చేసిన విమర్శలను ఆయన తన ఆత్మకథలో ప్రస్తావించారు.

''పంజాబులో జరిగిన ఘోరాలకన్నింటికీ అపరాధిని నేనేనని సర్ మైకేల్ ఓ డయ్యర్ నిర్ణయించాడు. ఇక అక్కడ కొందరు నవయువకులు మార్షల్ లాకు కారణం నేనేనని, నేను అపరాధినని అనడానికి కూడా వెనుకాడలేదు. కోపంతో పెట్రేగిపోయిన ఆ నవయువకులు సత్యాగ్రహోద్యమాన్ని నేను మధ్యలో వాయిదావేసి ఉండకపోతే జలియన్‌వాలాబాగ్ హత్యాకాండ జరిగివుండేదికాదని, మిలటరీ చట్టం అమల్లోకి వచ్చి ఉండేది కాదనే స్థితికి వెళ్లారు. గాంధీ గనక పంజాబ్‌లో అడుగు పెడితే తుపాకీతో కాల్చి పారేస్తామని కూడా కొందరు బెదిరించారు. కానీ నేను చేసిన పని సరైనదేనని, తెలివిగల వాళ్లెవరకూ అందుకు భిన్నంగా ఆలోచించరని నా నిశ్చితాభిప్రాయం.

ఒకవైపున ఉద్యమం (దాని నడక ఎంత సన్నగిల్లినా) నడుస్తూనే ఉన్నది. మరోవైపున ప్రభుత్వ పక్షాలన ఆ ఉద్యమ అణచివేత కార్యక్రమం ముమ్మరంగా సాగుతున్నది. పంజాబులో ఈ దృశ్యం కనబడింది. అక్కడ మిలటరీ చట్టం ప్రారంభమైంది, నాయకుల్ని నిర్బంధించారు. ప్రత్యేకించిన న్యాయ స్థానాలు న్యాయస్థానాలుగా ఉండకుండా, గవర్నరు ఆర్డరును పాటించే సాధనాలుగా మారిపోయాయి. విచారణ అనేదే లేకుండా అందరికీ శిక్షలు విధించారు. నిరపరాధుల్ని పురుగుల్లా బోర్లా పడుకోబెట్టి పాకించారు. ఈ దుర్మార్గం ముందు జలియన్ వాలాబాగ్‌లో జరిగిన ఘోరకృత్యం కూడా తలవంచుకుంది. అయితే బాగ్‌లో జరిగింది నరమేధం గనుక ప్రపంచాన్ని అది బాగా ఆకర్షించింది" అని గాంధీజీ రాశారు.

### సత్యాన్వేషణ రాజకీయానికి సాధనంగా మారిన స్వాతంత్ర్యోద్యమం

భారతదేశమనే తుపానుతో నిండిన సముద్రంలో తాను దూకుతున్నానని 1915లో స్వదేశానికి తిరిగివచ్చినప్పుడే గాంధీజీ అర్థం చేసుకున్నారు. అయితే రౌలట్ చట్టం, జలియన్‌వాలాబాగ్‌కు ముందు భారతదేశానికి స్వయంపాలనను మప్పటానికి, తన సత్యాన్వేషణ రాజకీయానికి ఆయన దేశీయ సమస్యలనే ప్రధానంగా ఉపకరణాలుగా చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. 1919లో ఒక్కసారిగా పరిస్థితి మారింది. బ్రిటీషు వారిని బైటికి గెంటటం అనే ప్రధాన కార్యక్రమ చట్రం పరిధిలోకి తన అంతకుముందు కార్యక్రమాలన్నిటినీ తీసుకొచ్చారు. దక్షిణాఫ్రికాలో తదుపరిదశలో కావచ్చు, ఆ తర్వాత భారత్‌కు తిరిగొచ్చాక కావచ్చు.. ఆయన లక్ష్యం అహింసాయుతంగా సత్యాన్వేషణతో ప్రజలకు సేవ చేయటమే. భారత్‌కొచ్చాక విస్తృతంగా మారిన ఆ లక్ష్యం కోసం ఇప్పుడొక భారీ స్థాయి సాధనం ఆయన చేతికి దొరికింది.

## జలియన్‌వాలాబాగ్ దురంతం

1919 నాటికి పంజాబ్‌లో రెండో అతిపెద్ద పట్టణం అమృత్‌సర్. జనాభా లక్షన్నర పైచిలుకు. అందులో 90 శాతం వరకు పేదలే. నలభై అయిదు శాతానికి పైగా ముస్లింలు, పదమూడు శాతం సిక్కులు. మిగతావారు హిందువులు. క్రైస్తవులు, బౌద్ధులు కూడా ఉన్నారు. ఆ ఏడాది ఏప్రిల్ 13 వైశాఖి పర్వదినం. సిక్కులకు నూతన సంవత్సరం ప్రారంభమయ్యేరోజు. రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా అమృత్‌సర్‌లో హర్తాళ్ జరిగినప్పుడు ఉద్యమకారులు సత్యపాల్, సైఫుద్దీన్ కిచ్లూలను ప్రభుత్వం నిర్బంధించింది. అందుకు నిరసనగా జరిగిన ప్రదర్శనపై పోలీసులు కాల్పులు జరపగా పలువురు అక్కడికక్కడే మరణించారు. మృతుల సంస్మరణార్థం, అరెస్టులను నిరసిస్తూ, ఇంకొందరు నూతన సంవత్సరం సందర్భంగా.. ఇలా వేలసంఖ్యలో జలియన్‌వాలాబాగ్ పార్కులో సమావేశమయ్యారు. దీన్ని నిషేధిస్తూ పంజాబ్ ప్రభుత్వం అంతకుముందు చేసిన ప్రకటన అంతగా ప్రజల్లో ప్రచారం కాలేదు. స్థానిక పరిస్థితుల పట్ల ఏమాత్రం అవగాహన లేని బ్రిటీష్ బ్రిగేడియర్ జనరల్ రెజినాల్డ్ డయ్యర్ తన సైన్యంతో పార్కును చుట్టుముట్టి ఎటువంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా కాల్పులకు ఆదేశించాడు. ఆ పార్కులో ప్రధానద్వారం మినహా అన్ని వైపులా తలుపులు మూసేసి ఉన్నాయి. కాల్పులకు భయభ్రాంతులైన ప్రజలు గుళ్ల వర్షం నుంచి తప్పించుకునేందుకు ఇరుకు ద్వారాల గుండా పరుగులు తీశారు. కొందరు ఎలాగోలా ప్రాణాలు దక్కించుకోవాలని పార్కులోని బావిలోకి దూకేశారు. పది నిమిషాలపాటు విచక్షణారహితంగా జరిపిన 1650 రౌండ్ల కాల్పుల్లో 379 మంది మరణించారని, 1,200 మందికిపైగా గాయపడ్డారని అప్పటి ప్రభుత్వం లెక్కవేసింది. కానీ 1,000 మందికిపైగా మరణించారని, అంతకు రెట్టింపు మంది గాయాలపాలయ్యారని అనధికార అంచనా. ఈ ఘటన పట్ల భారతీయ నేతలు, ప్రజానీకం తీవ్రంగా స్పందించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ తన నైట్‌హుడ్ గౌరవాన్ని తిరిగి ఇచ్చేశారు. 'మీ దారుణానికి బలైన నా దేశ ప్రజల వైపు నేను నిలబడాలనుకుంటున్నాను' అని మే 30న వైస్రాయికి రాసిన లేఖలో నిరసన వ్యక్తం చేశారు. 'నిరాయుధులు, నిస్సహాయులైన ప్రజలపై జరిగిన ఆ మారణకాండ సైనికుల తుపాకుల్లో బుల్లెట్లు అయిపోయాకగానీ ముగియలేదు' అని 1920లో బ్రిటన్ హౌస్ ఆఫ్ కామన్స్‌లో జరిగిన చర్చలో ఆ దేశ యుద్ధవ్యవహారాల కార్యదర్శి చర్చిల్ సభకు తెలియజేశారు. ఈ మారణకాండపై విచారణకు వలసపాలకులు హంటర్ కమిషన్‌ను నియమించారు. చివరకు అమృత్‌సర్ హంతకుడైన రెజినాల్డ్ డయ్యర్‌ను (ఇద్దరు డయ్యర్లున్నారు) కేవలం సర్వీస్ నుంచి తొలగించారు. ఇక డయ్యర్ సేనాని ఆ హత్యాకాండకు పాల్పడేందుకు సర్వాధికారాలు ఇచ్చిన పంజాబ్ గవర్నర్ మైఖేల్ ఓ డయ్యర్ శిక్ష కాదు గదా.. కనీసం అభిశంసనకు కూడా గురికాకుండా తప్పించుకున్నారు. మృతులకూ, క్షతగాత్రులకూ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తామని ముందుకొచ్చినా, పలువురు తిరస్కరించారు. ప్రజలు, కాంగ్రెస్ సభ్యులు కలిసి చందాలు వేసుకుని జలియన్‌వాలాబాగ్‌ను కొనుగోలు చేసి స్మారక కేంద్రాన్ని నిర్మించారు. విరాళాల సేకరణలో గాంధీ, మదన్‌మోహన్ మాలవీయ మొదలైనవారు ముందుండి పనిచేశారు. జలియన్‌వాలాబాగ్ స్మారక చిహ్నం గురించి గాంధీజీ తన పత్రిక 'యంగ్ ఇండియా'లో ఇలా రాశారు: "చనిపోయిన అమాయకుల స్మృతిని గౌరవించడం ఒక పవిత్ర బాధ్యతగా భావించాలి. ఆ మృతుల కుటుంబ సభ్యులు తమకు ఏదైనా సహాయం అవసరమైతే జాతి నుంచి దాన్ని పొందే హక్కు వారికి ఉన్నది. స్మారక కట్టడం ప్రాథమిక అర్థం, లక్ష్యం ఇదే. మహమ్మదీయుల రక్తం హిందువుల రక్తంతో కలియలేదా? సిక్కుల రక్తం సనాతనులు, ఆర్యసమాజికుల రక్తంతో మిళితమవలేదా? హిందువులు, ముస్లిముల మధ్య ఐక్యత సాధించేందుకు చిత్తశుద్ధితో చేసే సుస్థిర ప్రయత్నానికి ఈ స్మారక కట్టడం ఒక జాతీయచిహ్నంగా భాసిల్లాలి." బ్రిటీష్ వ్యతిరేక పవనాలు దేశవ్యాప్తం కావడానికి, భగత్‌సింగ్ వంటి యువత విప్లవకారులుగా మారడానికి బాగ్ దురాగతం ఆజ్యం పోసింది. జనరల్ మైఖేల్ డయ్యర్ 1940లో లండన్‌లో విశ్రాంత జీవితాన్ని గడిపే సమయంలో ఉద్ధం సింగ్ అనే భారత విప్లవకారుడి చేతిలో హతమయ్యాడు. జలియన్‌వాలాబాగ్ దారుణం జరిగి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఇటీవల పలు పుస్తకాలు విడుదలయ్యాయి. 'మార్టిర్‌డమ్ టు ఫ్రీడమ్: 100 ఇయర్స్ ఆఫ్ జలియన్‌వాలాబాగ్' అనే పుస్తకాన్ని 'ది ట్రిబ్యూన్' ఎడిటర్ రాజేష్ రామచంద్రన్ సంపాదకత్వం వహించారు. పంజాబ్‌లోని అతి పురాతనమైన ది ట్రిబ్యూన్‌లో ఆనాడు ప్రచురించిన వ్యాసాలలో ఎంపికచేసిన వాటిని ఈ పుస్తకం రెండో భాగంలో ప్రచురించారు. ఈ ఘటనపై బ్రిటన్ ప్రభుత్వం విచారాన్ని వ్యక్తం చేసిందిగానీ, ఇప్పటివరకూ క్షమాపణ చెప్పలేదు. దుర్మార్గానికి వందేళ్లు గడిచిన 2019, ఏప్రిల్ 13న కూడా బ్రిటన్ ప్రధాని మళ్లీ విచారంతో సరిపుచ్చారు. జాతీయవాదం చుట్టూ ఎన్నికలు జరుగుతున్నా కూడా ఈ ఏడాది ఈ అంశంపై మనదేశంలో పెద్ద చర్చ జరగకపోవటం విచిత్ర విశేషం.

అహింస, సత్యం అనే విలువలతో కూడిన స్వేచ్ఛాభారతాన్ని నిర్మించేలా రాజకీయాన్ని మార్చేందుకు దేశ స్వాతంత్ర్య పోరాటాన్ని గాంధీజీ మార్గంగా చేసుకున్నారు. బెంగాల్, పంజాబ్‌లలో రగిలిన స్వాతంత్ర్య ఆకాంక్ష దేశవ్యాప్తమవటాన్ని ఆయన ఒక పెద్ద

### సత్యాగ్రహ పోరాటాల గురించి విదేశీ పత్రికల్లోనూ విస్తృతంగా వార్తలు

1920, 30 దశకాలలో గాంధీజీ నిర్వహించిన సత్యాగ్రహ పోరాటాల గురించి ఆఫ్రికన్-అమెరికన్ పత్రికలలో విస్తృతంగా వార్తలు, వార్తాకథనాలు వెలువడ్డాయి. వీటిని శ్రద్ధగా చదువుతున్న షికాగో నగరవాసి ఆర్థర్ సెవెల్ అనే వ్యక్తి గాంధీజీకి రాసిన ఒక లేఖలో అమెరికాలోని నల్లజాతి ప్రజలు మీ ఉద్యమాలను శ్రద్ధగా, సానుభూతితో గమనిస్తున్నారని పేర్కొన్నారు. 'భారత్ పట్ల, భారతీయుల పట్ల నీగ్రో ప్రజలకు సంపూర్ణ సానుభూతి ఉన్నది. ఈ దేశంలో వారు (శ్వేత జాతీయులు) మమ్ములను దోచుకోవడం, జైళ్లలో పెట్టడమే కాదు, మూక దాడులు చేయడం, బహిరంగంగా చిత్రవధలకు గురిచేయడం, సజీవంగా దహనం చేయడం మొదలైన దురాగతాలకు గురిచేస్తున్నారు..." భారత్‌లో బ్రిటీష్ వలసపాలనకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం ప్రపంచవ్యాప్తంగా నల్ల జాతి ప్రజలు, ఇతర అణగారిన జాతుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు దారి తీస్తుందని తాము విశ్వసిస్తున్నామని ఆ ఆఫ్రికన్-అమెరికన్ అన్నారు. ఆర్థర్ సెవెల్ ఇంకా ఇలా రాశారు: 'భగవంతుడు మిమ్మల్ని ఆశీర్వదించుగాక! ధర్మరక్షణకు, మానవ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం మీరు చేస్తున్న పోరాటాలు విజయవంతమవ్వాలని 140 లక్షల మంది అమెరికన్ నీగ్రోలు ప్రార్థిస్తున్నారు.' ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ నాయకులతోను, అమెరికాలోని పౌరహక్కుల కార్యకర్తలతోను గాంధీజీకి సౌహార్ద సంబంధాలు ఉండేవి. 1920వ దశకంలో ప్రచురితమయిన 'సత్యాగ్రహ ఇన్ సౌత్ ఆఫ్రికా' అన్న తన పుస్తకంలో ఆఫ్రికన్ మతాన్ని ఆయన స్ఫూర్తిదాయకంగా సమర్థించారు. యూరోపియన్ మిషనరీల అభిప్రాయాలతో విభేదిస్తూ గాంధీ ఇలా రాశారు: 'సత్యం, అసత్యం మధ్య ఉన్న వ్యత్యాసం గురించి ఆఫ్రికన్లకు స్పష్టమైన అవగాహన ఉన్నది. యూరోపియన్లు, భారతీయుల కంటే ఆఫ్రికన్లే సత్యమార్గాన్ని పరిపూర్ణంగా అనుసరిస్తున్నారు. సత్యాచరణలో ఆఫ్రికన్లనే మొదట చెప్పవలసివున్నది'.

– రామచంద్ర గుహ, చరిత్రకారులు

అవకాశంగా గుర్తించారు. బ్రిటీషు పాలకుల దమననీతి, భారతీయుల్లోని అంతర్గత శక్తి గాంధీజీ సామర్థ్యానికి, సంకల్పానికి సానబట్టాయి. దేశ ప్రజల తక్షణావసరానికి, తన దీర్ఘకాలిక లక్ష్యానికి ఆయన చాలా పకడ్బందీగా ముడి వేయగలిగారు. అంతకుముందు కంటే మరింత లోతుతో, విస్తృతితో గాంధీజీ తన కార్యక్రమాలను చేపట్టటం ఆరంభించారు. వేగంగా పురోగమించ గలిగారు.

### పరిణామాలు గాంధీ ఆలోచనల చుట్టూనే

జలియన్‌వాలాబాగ్ వందేళ్ల సందర్భంగా పాకిస్తాన్‌లో పత్రికలు కూడా ప్రత్యేక కథనాల్ని ప్రచురించాయి. అయితే మహమ్మద్ అలీ జిన్నా చుట్టూ ఎక్కువ రాశాయి. ఆయన స్పందనల్ని, ప్రసంగాల్ని ప్రముఖంగా ప్రచురించాయి. గాంధీజీ ప్రస్తావన దాదాపు చేయలేదు. కానీ నిజానికి అణచివేతలు, జలియన్‌వాలాబాగ్ రక్తచరిత్ర ఆనాటి పాకిస్తాన్‌సహిత భారత్‌లో గాంధీ శకానికి నాంది పలికింది. 1947లో దేశ స్వాతంత్ర్యం వచ్చే వరకూ గాంధీతో విభేదించిన విప్లవకారులు వంటి వారి ప్రభావం కూడా కొనసాగిందిగానీ, ప్రధానంగా పరిణామాలు మాత్రం గాంధీ ఆలోచనల చుట్టూనే చోటు చేసుకున్నాయి. 1920 సహాయ నిరాకరణ ఉద్యమం నుంచి మొదలైన గాంధీజీ సత్యాన్వేషణ పోరాటం జాతీయోద్యమాన్ని కొత్తమలుపు తిప్పి ఆయనలోని మహాత్ముడ్ని ఆవిష్కరింప చేశాయి. ఆ దిశగా గాంధీ గారు తన కార్యాచరణను మలచుకోవటం ప్రారంభించారు. 1920లో సహాయ నిరాకరణ ఉద్యమానికి పిలుపునిచ్చారు. ఆ తర్వాత 1930-34 మధ్య ఉప్పు సత్యాగ్రహం ద్వారా పోరాటాన్ని ఉధృతం చేశారు. 1942లో 'సాధించు లేదా మరణించు' అంటూ బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా 'క్విట్ ఇండియా' నినాదంతో పోరాడారు. బ్రిటీష్ దమననీతి పట్ల అట్టుడుకుతూ హింసకు ఉడుకునెత్తురుతో దూకుతున్న భారతీయుల్ని అహింసాయుత పోరాటం వైపు నడిపించటమనే సవాలు కొన్నిసార్లు తడబాటుకు గురిచేసినా అంతిమంగా గాంధీ నిలదొక్కుకుని ఒక అహింసాయుత యోధుడిగా, దార్శనికుడిగా దేశాన్ని నడిపించగలిగారు.

### పెద్ద, ఉమ్మడి శత్రువును బూచిగా చూపడంతో ఉప్పొంగిన జనశ్రేణులు

ఒక పెద్ద, ఉమ్మడి శత్రువును బూచిగా చూపించి ప్రజల్ని సమీకరించటం ఒకరకంగా గాంధీ గారికి ఎంతో కలిసివచ్చింది కూడా. ఈవేళ చాలామంది లోక్‌సత్తాను చాలామంది అడుగుతుంటారు-గాంధీ, అంబేద్కర్లను కలుపుతూ సిద్ధాంతాన్ని

రూపొందించుకున్న లోక్‌సత్తా పార్టీ జాతీయోద్యమంలోలా ప్రజల్ని ఎందుకు సమీకరించలేకపోతోంది? అని. ఆవేళ దేశప్రజలందరికీ శత్రువు సుస్పష్టంగా ఒక్కడే. అలా బలమైన శత్రువును ఎదుర్కోవటానికి జాతి మొత్తం ఏకమవటం వేగంగా, చాలామేర సులభంగా కూడా జరుగుతుంది. ఈవేళ పరిస్థితి వేరు. స్వదేశంలో, మనల్ని మనం సంస్కరించుకోవటానికి చేసే పోరాటం చాలా సంక్లిష్టమైనది. అందులో ఈవేళ్టి ఆర్థిక వాతావరణం కూడా జాతీయోద్యమ కాలంనాటికి పూర్తిగా భిన్నమైనది. ఇప్పుడు ప్రజలు అవగాహనతో రావాలి తప్ప, ఉద్రేకాలతో వచ్చే అవకాశాలు తక్కువ. సాంప్రదాయ పార్టీల్లా కులం, మతం, భాష వంటి వాటి పేరుతో ప్రజల్ని రెచ్చగొట్టి జనాల్ని ఆకర్షించవచ్చు. కానీ అది రాజకీయమవదు. ఇంకోవైపు, ప్రజల్ని సమీకరించడానికి జాతీయోద్యమ కాలం నాటి హర్తాళ్లు, బంద్‌లు, ఆమరణ నిరాహారదీక్షలు వంటివి రాజ్యాంగబద్ధ స్వతంత్ర భారతదేశంలో అనుసరించ తగని ఆందోళనా పద్ధతులు.

**గాంధీ లేకున్నా స్వాతంత్ర్యం వచ్చేది, కానీ ఈనాడున్న భారతదేశం ఉండేది కాదు**

గాంధీజీ తన సత్యాన్వేషణ రాజకీయానికి భారత స్వాతంత్ర్య సాధనను మార్గంగా చేసుకోవటం వల్లే దేశానికి 1947లో స్వాతంత్ర్యం వచ్చిందనుకోనక్కర్లేదు. రెండో ప్రపంచ యుద్ధ నేపథ్యంలో వలస దేశాల్ని భరించే శక్తిని కోల్పోయిన బ్రిటన్ భారత్‌కు అనివార్యంగా స్వాతంత్ర్యాన్ని ఇవ్వాల్సిన పరిస్థితిలోకి వెళ్లింది. అందుకే గాంధీజీ వంటి నాయకుడు లేని దేశాలకు కూడా స్వాతంత్ర్యం వచ్చింది. గాంధీజీ లేకున్నా భారత్‌కు కూడా అలా స్వాతంత్ర్యం కాస్త అటూఇటుగా వచ్చేది. కానీ ఇప్పుడు మనం చూస్తున్నట్లు భారతదేశం ఉండటం సాధ్యమయ్యేది కాదు. ఎన్నో కులాలు, మతాలు, తెగలు, భాషలు, సంస్కృతులతో సంక్లిష్టంగా ఉన్న భారత ప్రాంతం.. స్వాతంత్ర్యం వచ్చేనాటికి ఒక దేశంగా జాతీయతాభావంతో కలిసి ఉండటాన్ని ఊహించగలిగేవారం కాదు. స్వతంత్రం వచ్చే సమయానికి భారత్‌లో జాతి నిర్మాణానికి, ఆధునిక భారతదేశానికి కావలసిన పునాదిని గాంధీ వేయగలిగారు. ఇతర సాధనాల కంటే వేగంగా ఆ లక్ష్యం వైపు చేరటానికి స్వతంత్ర పోరాటం ఆయనకు అందుకు ఎంతో బాగా ఉపయోగపడింది. స్వతంత్ర భారతదేశం ఎన్నాళ్లో మనుగడ సాగించలేదు అని ఎద్దేవా చేసిన పాశ్చాత్యులను నివ్వెరపరుస్తూ డెబ్భై ఏళ్లు దాటినా భారత్ చెదరకుండా కొనసాగుతోందీ అంటే.. మహాత్ముడు ఆరోజు పునాది వేశారు కాబట్టే! ఆయన పునాదికి రాజ్యాంగం తోడైంది కాబట్టే!! ప్రపంచంలో అభివృద్ధి చెందినవైనా కూడా రెండు భాషల కోసం కొట్టుకుంటున్న దేశాలున్నాయి. గోచీపాతంత దేశాలు కూడా ఎప్పుడు విడిపోతాయా అన్నట్లున్నాయి. కానీ ఎంతో అవిద్య, పేదరికం మధ్య కూడా భిన్నత్వాన్ని, సంక్లిష్టతల్ని సమతుల్య పరిచే ధోరణిని గాంధీజీ మనదేశంలో జొప్పించారు. స్వతంత్ర పోరాటంలో ప్రజలను భాగస్వాముల్ని చేసే క్రమంలో గాంధీజీ అనితరసాధ్యమనదగ్గ రీతిలో జాతి నిర్మాణం చేశారు. దేశభక్తితో కూడిన జాతీయతా భావాన్ని పెంపొందించారు. చౌరీచౌరా హింసాత్మక ఘటన నేపథ్యంలో సహాయ నిరాకరణ ఉద్యమాన్ని నిలిపివేయటం ఆయన సైద్ధాంతిక, నాయకత్వ నిబద్ధతతకు విస్పష్ట నిదర్శనం.

**అతివాద ధోరణుల్ని కూడా తన అహింసాయుత పోరాటంలో ఇముడ్చుకుంటూ..**

ఇలా రౌలట్ చట్టం, దాని వల్ల పంజాబ్ తదితర ప్రాంతాల్లో సైనిక అణచివేతలు, ఆ తర్వాత జరిగిన జలియన్‌వాలా బాగ్ దురంతం నేపథ్యంలో జాతి నిర్మాణానికి జాతీయోద్యమాన్ని ఒక బలమైన ఉపకరణంగా అందించింది కాబట్టే.. స్వాతంత్ర్యోమ చరిత్రలోనే కాకుండా, దేశ చరిత్రలో ఒక టర్నింగ్ పాయింట్‌గా గుర్తించదగ్గ సంవత్సరం 1919. విదేశీ పాలకుల సైనిక, ఆర్థిక శక్తిని, స్వదేశీ ప్రజల వివక్షలు, దుందుడుకు ధోరణుల్ని తన అహింసాయుత పోరాట పంథాలో చక్కగా బిగించి 'సృజనాత్మక ఒత్తిడి' పంథాలో దేశ స్వాతంత్ర్యమనే మైలురాయి వైపు నడిపిస్తూ గాంధీజీ ఆధునిక భారతదేశానికి పునాది వేశారు. 1919 నుంచి 1947లో భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చేవరకూ గాంధీజీ చేసిన ఉద్యమాలు ఎక్కువ లేకపోవచ్చు. కానీ ప్రజల్లోకి అహింస, సత్యాగ్రహం, జాతీయత వంటి భావనల్ని తీసుకెళ్లటానికి చక్కటి లెక్కలతో ఆయన ఉద్యమాల మధ్య విరామాన్ని పాటించారు. ముస్లింలీగ్‌ను నిర్లక్ష్యం చేయటం, అనవసరంగా క్విట్ ఇండియా పిలుపునివ్వటం వంటి పొరపాట్లున్నా కూడా ఆయన పోరాటం స్థూలంగా ఆధునిక భారతదేశానికి నాంది పలికింది. శత్రువైన బ్రిటీషువారి పట్ల హింసాత్మక ద్వేషాన్ని పెంచకుండా ఆయన సాగించిన అహింస, సత్యశోధన రాజకీయం యావత్ ప్రపంచంలోనే పలువురికి ఆదర్శంగా అయ్యింది.

**పునాది వేశాను తప్ప.. విజయం సాధించలేదని కన్నీళ్లు**

రెండో ప్రపంచయుద్ధం వల్ల దేశానికి 'గాలి వీచినంత స్వేచ్ఛగా స్వతంత్రం వస్తుంది' అని స్పష్టంగా గుర్తించాక జాతి నిర్మాణం, ప్రపంచ శాంతి అంశాల మీద గాంధీజీ తిరిగి పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించారు. అంతర్జాతీయ అంశాలకు సంబంధించి బ్రిటన్‌ను ఒక శత్రువుగా కాకుండా, భాగస్వామిగా సంభోదించారు. ప్రపంచశాంతికి బ్రిటన్, భారత్‌లు కలిసి పనిచేయాలన్నారు. విశ్వపటంలో ఈ అద్భుత దృశ్యాన్ని చూడడానికి తాను సుదీర్ఘకాలం బతికుండాలని ఆశపడ్డారు.

కానీ ఎప్పుడైతే స్వాతంత్ర్యం వచ్చి దేశ విభజన చుట్టూ బీభత్సకర పరిణామాలు చోటుచేసుకున్నాయో, తాను ఆశించిన లక్ష్యానికి పునాది మాత్రమే వేయ గలిగానని, విజయం సాధించలేదని గాంధీజీ గుర్తించారు. అందుకే దేశమంతా స్వాతంత్ర్యదినోత్సవాన్ని జరుపు కుంటుంటే, ఢిల్లీకి దూరంగా కన్నీరు కారుస్తూ గడిపారు. తాను ఇన్నేళ్లపాటు జొప్పించిన విలువలు విభజన పరీక్షకు నిలబడలేకపోవటాన్ని గాంధీజీ తట్టుకోలేకపోయారు. సుదీర్ఘకాలం బతకాలని ఆశపడ్డ వ్యక్తి.. జరుగుతున్న విషాదాల్ని చూసే బదులు దేవుడు తనను త్వరగా తీసుకుపోతే బాగుండునని చుట్టూ ఉన్నవారితో కన్నీళ్లతో చెప్పారు.

గాంధీజీ చనిపోయి బతికిపోయారు.. అని ఆయన చివరి వ్యక్తిగత సహాయకుడి గా పనిచేసిన వి.కల్యాణం కూడా ఆమధ్య ఓ ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. దేశ విభజన సమయం లో ఏ రకమైన దృశ్యాలను, పరిస్థితులను చూసి గాంధీజీ కలత చెందారో, ఆరకమైన పరిస్థితులు ఈవేళ దేశంలో మరోరూపంలో పెచ్చరిల్లాయని, గాంధీజీ ఆశించిన స్వయంపాలన రాలేదని ఆయన అభిప్రాయపడ్డారు. రౌలట్ చట్టం వంటి అణచివేతలు వంటి శ్రమ కూడా అవసరం లేకుండానే ప్రజల మధ్య అలా చిచ్చుపెట్టేసే పరిస్థితులున్నాయంటే, డెబ్భై ఏళ్ల స్వతంత్ర భారతదేశం గాంధీ తదనంతరం ఏమేరకు ఆ విలువల్ని పెంపొందించు కోగలిగిందో జాతి ఆత్మపరిశీలన చేసుకోవాలి.

**మహాత్మాగాంధీ అసంపూర్ణ లక్ష్యాన్ని నెరవేర్చాలి, దేశ చరిత్రను కొందరు వ్యక్తుల చరిత్రగా కాకుండా.. వ్యవస్థల పనితీరుగా మార్చాలి**

మహాత్మాగాంధీ లక్ష్యమైన జాతి నిర్మాణం ఇప్పటికీ అసంపూర్ణంగా ఉండటానికి, మన రాజ్యాంగానికి–సమాజానికీ మధ్య కొనసాగుతున్న అగాధమే కారణం! 1919లో మాంటేగ్–షెమ్స్‌ఫర్డ్ సంస్కరణలతో వచ్చిన భారత ప్రభుత్వ చట్టం మొత్తం దేశాన్ని స్వపరిపాలన దిశగా అడుగులు వేయించిన తొలి పెద్ద రాజకీయ ప్రయత్నం. 'స్వయంపాలన ప్రభుత్వం' అని కాకుండా.. 'బాధ్యతాయుత ప్రభుత్వం' అనే పదం వాడినా కూడా వలస భారతదేశంలో ఇదో చెప్పుకోదగిన అడుగు. స్వతంత్ర పోరాటంతో సమాంతరంగా 1919లో, దాన్ననుసరించి 1935లో వచ్చిన చట్టం భారతదేశానికి రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యం దిశగా అపరిపక్వంగానే అయినా పునాదినేర్పరిచాయి. 1935 చట్టానికి కొనసాగింపుగా, భారత్‌ను ఒక జాతిగా తీర్చిదిద్దగలిగే శక్తిగా స్వతంత్ర భారతదేశం ఏర్పాటు చేసుకున్న రాజ్యాంగం ఈవేళ చాలా సందర్భాల్లో చిత్తుకాగితం కింద మిగిలిపోతోంది. ఒకరకంగా వ్యవస్థలు, అవగాహనతో ప్రజల భాగస్వామ్యంకంటే వ్యక్తుల నిజాయతీకే గాంధీజీ ఎక్కువ ప్రాధాన్యతనివ్వటం కూడా ఇందుకు కొంత పరోక్షంగా కారణమైంది. 'ప్రపంచానికి శాస్త్రం తెలుసుకుందామనే అభిలాష కంటే, విశ్వాసంతో చేయబడిన పని లేక కార్యం అవసరం" అని వినోబా గురించి ఓ సందర్భంలో గాంధీజీ వ్యాఖ్యానించారు. కానీ ఒక దేశ చరిత్ర అంటే కొందరు వ్యక్తుల చరిత్ర కాదు, వ్యవస్థల పనితీరు.. అని గుర్తిస్తేనే మనం మహాత్మాగాంధీ మహాకార్యంలోని అసంపూర్ణతను పూరించగలం. అలాగే గ్రామ స్వరాజ్యం గురించి గాంధీ గారికి కొంత అవాస్తవిక రొమాంటిసిజంతో కూడిన భావాలున్నాయి. అలాంటివి సరిచేసుకుంటూ మహాత్ముడి మార్గాన్ని, విలువల్ని, నాయకత్వ ధోరణుల్ని ఆచరణలోకి తెచ్చుకోవాలి. చట్టబద్ధపాలన, ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య, ప్రతి కుటుంబానికీ మంచి ప్రమాణాల ఆరోగ్యం, స్థానిక సాధికారత, అవినీతిరహిత పౌరసేవలు, సమర్థత, నిబద్ధత ఉన్న వారు చట్టసభల్లో ప్రవేశించేలా ఎన్నికల సంస్కరణలు వంటి మార్పుల్ని సాధించుకునేలా వ్యవస్థల్ని రూపొందించుకుంటే, టర్నింగ్ పాయింట్ 100 ఏళ్లను అర్థవంతంగా సెలబ్రేట్ చేసుకున్నట్లవుతుంది. జలియన్‌వాలాబాగ్ దురంతానికి వందేళ్లయిన సందర్భాన్నే పట్టించుకోని, సమీక్షించుకోని, ఆ దారుణానికి బ్రిటన్ నుంచి క్షమాపణను బేషరతుగా కోరలేని పాలకులు ఉన్న దశలో.. మన అవగాహన, కార్యాచరణ మరింత పదునుగా, పటిష్టంగా ఉండాలి. *

# భవిష్యత్తు గాంధీ గ్రామాల్లో లేదు.. ఆధునిక నగరాల్లో ఉంది

- మౌర్య కృష్ణ సి




స్థానిక ప్రభుత్వాలకు అధికారాన్ని వికేంద్రీకరించాలన్న మహాత్మాగాంధీ అభిప్రాయం వంక పెట్టలేనిది. కానీ గ్రామాల గురించి ఆయన అంచనాను మాత్రం యధాతథంగా ఆమోదించలేం.

స్వయంప్రతిపత్తిగల పల్లెలు స్వర్గతుల్యంగా విలసిల్లుతాయన్న గాంధేయ వాదన కేవలం రొమాంటిక్ ఊహ మాత్రమే. బహుశా, అప్పుడున్న పరిస్థితులను బట్టి గాంధీజీ గ్రామాలను భారతదేశ ప్రజాస్వామ్యానికి ప్రాథమిక యూనిట్లుగా విశ్వసించి ఉండవచ్చు. కానీ, మహాత్ముడు ఇప్పుడు గనక ఉండి ఉంటే.. ఆయన గ్రామస్వరాజ్యం చుట్టూ అల్లిన తన సుప్రసిద్ధ కొటేషన్‌ను మార్చుకునేవారని నమ్ముతున్నాను. నేటి గాంధీ నగరాలకు పెద్దపీట వేసి ఉండేవారు. 'భారతదేశ భవిష్యత్తు గ్రామాల్లో ఉంది' అనడానికి బదులు.. 'భారత భవిష్యత్తు పటిష్ట నగరాల్లో ఉంది' అని వక్కాణించేవారు.

పూర్వకాలంలో కూడా మన దేశంలో నాగరికతకు, సామ్రాజ్యాలకు నగరాలే చోదకశక్తులుగా ఉండేవని పలు ఆధారాలు చెబుతున్నాయి. సింధు నాగరికతనే తీసుకోండి. అక్కడ నగరాలు మొక్కుబడి నిర్మాణాల్లా కొనసాగకుండా, పరిఢవిల్లాయి. పటిష్టమైన పట్టణ ప్రణాళిక, పాలన వల్ల ఆనాడు నగరాలు భాసిల్లాయి. అలాగే కుషాన్లు, శాతవాహనుల పాలనలో పట్టణాలు పాలనలో ప్రముఖస్థానాన్ని ఆక్రమించాయి. ఢిల్లీ సుల్తానుల జమానాలో పట్టణాలు వ్యాపారవాణిజ్యాలకు, అభివృద్ధికి నిలయాలుగా నిలిచాయి.

**ఈవేళ నగరాలకు ఎందుకు ప్రాధాన్యతనివ్వాలి?**

2011 జనాభా లెక్కల ప్రకారం, మన దేశ జనాభాలో 31 శాతం మంది నగరాల్లో నివశిస్తుండగా, మిగిలినవారు గ్రామాల్లో ఉంటున్నారు.

మరైతే.. మూడింట రెండు వంతుల జనాభా గ్రామాల్లో ఉంటుండగా, గ్రామాలకంటే నగరాల గురించి ప్రాధాన్యతతో ఆలోచించాలనటం విచిత్రంగా అనిపించటం లేదూ?

అయినా కూడా నగరాలకు మరింత ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సిన సమయమిది. ఎందుకంటే..

మొదటిది, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా వ్యవసాయం మీద ఆధారపడినది. ఈవేళ వ్యవసాయం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. అనేకమంది ప్రజానీకం నగరాలకు వలస పోతున్నారు. వారికి కొంతైనా గౌరవప్రదమైన జీవితాన్ని అందించాలంటే.. ఉద్యోగాలు, అందుబాటులో ఇళ్లు, నాణ్యమైన మౌలిక వసతులు వంటివి నగరాల్లో ఉండాలి.

రెండోది, నగరాలు సాముదాయక ఫలితాలనిస్తాయి. అంటే, ఒకే సామాజిక-సాంస్కృతిక, లేదా ఆర్థిక కలాపాలు చేసే వ్యక్తులు లేదా బృందాలు ఉండటం వల్ల వచ్చే లాభాలు. ఉదాహరణకు, పునరుజ్జీవన యుగంలో ఇటలీలో ఫ్లారెన్స్ నగరం ఓ కీలక భూమికను పోషించింది. దీంతో అక్కడ లియోనార్డో డావిన్సి లాంటి అసమాన ప్రతిభావంతులు వెలుగులోకి వచ్చారు. ఇంగ్లండ్‌లోని బర్మింగ్‌హామ్ పారిశ్రామిక విప్లవానికి పునాదిలా పనిచేసింది. భారతదేశంలో ఆటోమొబైల్ ఉత్పత్తి పరిశ్రమలన్నీ చెన్నై చుట్టుపక్కల కేంద్రీకృతమవ్వగా, సాఫ్ట్‌వేర్ పార్కులు బెంగళూరు చుట్టూ రూపుదిద్దుకున్నాయి.

మూడోది, నగరాలు మేధోసంపదకు నిలయాలు. పారిశ్రామికవేత్తలు, ఔత్సాహికులు, విద్యార్థులు తదితర

సామాజిక స్ఫూర్తిగల నాయకులు పెద్దసంఖ్యలో మనకు ఇక్కడ కనిపిస్తారు. నగరమే లేకపోతే ఇలా స్థానికంగా అనేకమంది విశిష్ట వ్యక్తులు అగుపించరు. వీరి శక్తిసామర్థ్యాల్ని, నైపుణ్యాల్ని పాలనను మెరుగుపరిచేందుకు వినియోగించుకోవటం నగరాలలో సాధ్యపడుతుంది.

చివరిగా, వనరుల కొరత, పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లిపోతుండటం వల్ల నైపుణ్యం గలవారి సంఖ్య తగ్గిపోతూ గ్రామాలు ఉన్నకొద్దీ ప్రాధాన్యతను కోల్పోతున్నాయి. స్వల్పస్థాయి ఆర్థిక కలాపాల వల్ల వాటి వనరుల స్థాయి కూడా పరిమితంగా ఉంటోంది. దీంతో, గ్రామీణ ప్రాంతాలు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి నిధుల బదిలీ మీదే ఆధారపడుతున్న నిస్సహాయ స్థితిలో ఉన్నాయి.

కాబట్టి, గ్రామాలు ప్రస్తుతమున్న స్థితిలో, రూపంలో కొనసాగలేవు. మార్చాలంటే, పట్టణీకరణను ప్రవేశపెట్టాలి. ఒక గ్రామమో లేక గ్రామాల సముదాయమో వ్యవసాయేతర ఆర్థిక కలాపాలను ఓస్థాయిలో చేపట్టాలి. ఉద్యోగాలను పెంచాలి. తద్వారా నగరాలకు వలసలను అరికట్టాలి. ఇది అభివృద్ధిని పెంచటమే కాకుండా, ఆర్థికస్థాయిని విస్తృతపరచుతుంది. మితిమీరిన జనాభా భారంతో కిక్కిరిసిపోయిన ఢిల్లీ, ముంబయి లేదా బెంగళూరు వంటి నగర ప్రాంతాలకు ఉపశమనం కూడా కలుగుతుంది.

దేశాభివృద్ధిలో నగరాల కీలక పాత్ర స్పష్టంగా కనిపిస్తున్న నేపథ్యంలో, వాటిని అందుకు సన్నద్ధం చేయటమెలా అన్నది ఇప్పుడు ప్రశ్న. ఈ ప్రశ్నకు జవాబు 3 ఎఫ్‌లు, 1 సీ లో ఉంది. అంటే, ఫంక్షన్స్, ఫంక్షనరీస్, ఫండ్స్, సిటిజన్ పార్టిసిపేషన్! మన నగరాలు, మునిసిపాలిటీలకు అధికారాల్ని, సిబ్బందిని, నిధుల్ని అందించటంతోపాటు పౌరులు ఎక్కడికక్కడ రోజువారీ పాలనలో భాగస్వాములయ్యేలా చేయటమే నగర భారతానికి మన సన్నద్ధత అవుతుంది.

**విధులు/అధికారాలు**

భారత రాజ్యాంగంలోని 12వ షెడ్యూల్ ప్రకారం, 18 విధులు మునిసిపాలిటీల పరిధిలోకి వస్తాయి. ఇందులో పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, వ్యర్థపదార్థాల నిర్వహణ, పార్కులు, వీధిదీపాలు తదితర ప్రజాసౌకర్యాల కల్పన, రోడ్లు, వంతెనలు, నీటి సరఫరా, అగ్నిమాపక సేవలు వంటివి మొదలైనవి ఉన్నాయి. అయితే, క్షేత్రస్థాయిలోకి వెళ్లి చూస్తే వీటికి సంబంధించి వాస్తవాలు వేరేగా కనిపిస్తాయి.

రాష్ట్ర ప్రభుత్వాల పర్యవేక్షణలో పనిచేసే పలు ప్రభుత్వ సంస్థలు మునిసిపాలిటీల విధుల్లో తలదూరుస్తుంటాయి. నీటి సరఫరా, పారిశుద్ధ్య బోర్డులు, రోడ్లు, వంతెనల విభాగం వంటివి మునిసిపాలిటీల మీద పెత్తనం చేస్తుంటాయి. ఉదాహరణకి, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లయ్ అండ్ సెవరేజ్ బోర్డు (హెచ్ఎండబ్ల్యుఎస్ఎస్‌బి)కి ముఖ్యమంత్రి నేతృత్వం వహిస్తారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఉంటారు. పశ్చిమ బెంగాల్‌లో మునిసిపాలిటీ చేయాల్సిన అగ్నిమాపక సేవలు– రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉంటుంది. కోచిలో రోడ్లు, వంతెనల విభాగం కోచి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోకి రాదు. రోడ్లకు సంబంధించి అన్ని అధికారాలూ రాష్ట్ర ప్రభుత్వ గుప్పెట్లోనే ఉంటాయి. చివరికి ఒక బస్టాప్‌ను కూడా మునిసిపాలిటీ మంజూరు చేయలేదు.

దీనివల్ల, మునిసిపాలిటీలు మొత్తం 18 విధుల్లో కేవలం 5–6కు మాత్రమే పరిమితమై పోతున్నాయి. నియంతృత్వ దేశం చైనాలో కూడా ఈ పరిస్థితి లేదు. షాంఘై లాంటి నగరం.. ట్రాఫిక్, పోలీస్‌తోపాటు విమానాశ్రయాలను కూడా నిర్వహిస్తుంది.

**సిబ్బంది**

మన దేశంలో మేయర్లు మునిసిపల్ ప్రభుత్వాల్లో కేవలం ఉత్సవ విగ్రహాలు. నిజమైన అధికారం మునిసిపల్ కమిషనర్ చేతుల్లో ఉంటుంది (ఈ కమిషనర్‌ని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది). చాలా మునిసిపాలిటీల్లో బడ్జెట్‌ను కమిషనర్ నిర్ణయిస్తారు.

అదేరకంగా, మునిసిపల్ సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వమే నియమిస్తుంది. దీంతో, తమ సొంత సిబ్బంది మీద మునిసిపాలిటీలకు నియంత్రణ చాలా తక్కువగా ఉంటుంది. అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంటుంది. ఆ దేశాల్లో మేయర్‌కు విస్తృతాధికారాలు ఉంటాయి. తన సిబ్బందిని నియమించుకునే, నియంత్రించే అధికారం మేయర్‌కు ఉంటుంది.

**నిధులు**

నిధుల విషయానికొస్తే, ఇండియాలో నగరాలకు రెండు సమస్యలు ప్రధానంగా కనిపిస్తాయి. పై స్థాయి ప్రభుత్వాల నుంచి నిధుల బదిలీ అరకొరగా ఉండటం, సొంత ఆదాయ వనరులేమో పరిమితంగా ఉండటం.

బయటి నుంచి నిధుల కోసం ఎదురుచూడాల్సి రావటం, స్థానికంగా వనరులను పెంచుకునే సామర్థ్యం తక్కువగా ఉండటం వల్ల పట్టణ స్థానిక ప్రభుత్వాలు దిగువస్థాయిలోనే కొట్టుమిట్టాడుతున్నాయి (ఆర్థిక సర్వే 2017–18). ఆస్తిపన్ను మీద అతిగా ఆధారపడుతున్నాయి. ఇందులో కూడా పన్ను

వసూలు సామర్థ్యం అంతంతమాత్రమే (బెంగళూరులో 30 శాతం లోపే). ఇతర పన్ను మార్గాలు బహు పరిమితంగా ఉన్నాయి. మారుతున్న పరిస్థితులకనుగుణంగా ఆదాయాన్నిచ్చేవిగా రూపుదిద్దుకో లేకపోతున్నాయి. కేరళలో, భవనాలపై పన్నును చివరిసారిగా 1992లో సవరించారు. అధికారం రాష్ట్ర ప్రభుత్వం చేతుల్లో ఉండటం వల్ల, ఆ పన్ను విషయంలో మునిసిపాలిటీలు ఎటువంటి కాలానుగుణ మార్పుల్నీ చేయలేకపోతున్నాయి.

యూనియన్ (కేంద్ర), రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధుల బదలాయింపు ఏమాత్రం స్థానిక అవసరాలకు తగినట్లుగా లేదు. ప్రస్తుతం సంప్రదింపుల కోసం వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తున్న 15వ ఆర్థికసంఘం ముందు పలు రాష్ట్రాలు స్థానిక ప్రభుత్వాలకు మరిన్ని నిధుల అవసరాన్ని ఏకరువు పెడుతున్నాయి. నిధుల్ని స్థానిక ప్రభుత్వాలకు వికేంద్రీకరించాలని డిమాండ్ చేస్తున్నాయి (కేంద్రం నుంచి నిధుల్ని డిమాండ్ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్ నుంచి ఎంతిస్తున్నాయన్నది వేరే విషయం).

**పౌరుల భాగస్వామ్యం**

కేరళ లాంటి రాష్ట్రాల్లో మినహాయించి వార్డు కమిటీలు పనిచేయకపోవటం వల్ల పౌరుల భాగస్వామ్యం పేరుకు తప్ప ఉనికిలో లేదు. రాజస్తాన్‌లో వార్డు కమిటీలు మూలనపడి దాదాపు దశాబ్దకాలం దాటిపోయింది. ఈరకమైన నిర్లక్ష్యం, అణచివేతలతో ప్రజల భాగస్వామ్య పాలన ఉనికిలోకి రాకుండా చేస్తున్నారు. భారత్‌లో పట్టణీకరణను పునరుజ్జీవింప చేయటానికి ఈ అంశం ప్రాధాన్యతను లోతుగా అర్థం చేసుకోవాలి.

**నగరాలు నివాసయోగ్యంగా ఉండాలంటే..**

మొదటిది, భారతరాజ్యాంగంలోని 12వ షెడ్యూల్‌లో పేర్కొన్న మొత్తం 18 విధులనూ మునిసిపాలిటీల పరిధిలోకి తేవాలి. పూర్తిగా వీటిని బదలాయించటం సాధ్యం కాదనుకుంటే, సమన్వయానికి ఒక పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

రెండోది, మునిసిపల్ నాయకత్వం -ఎన్నికైన మేయర్ లేదా (భోపాల్, కోల్‌కతాల్లోలా) మేయర్-ఇన్-కౌన్సిల్‌కి సాధికారత కల్పించాలి. స్థానిక పరిస్థితులను బట్టి స్వయంప్రతిపత్తిని కల్పించాలి. రాష్ట్ర ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో సెక్రటరీ (కమిషనర్)ని నియమిస్తే, ఆ నియామకాన్ని నిలువరిస్తూ కోచి నగర మునిసిపాలిటీ తీర్మానాన్ని జారీ చేయగలదు. అలా స్థానిక స్వతంత్ర ప్రతిపత్తి లేదా స్థానిక నాయకత్వానికి అధికారాలను కల్పించాలి.

మూడోది, ఆర్థిక సంఘం లేదా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా, లేదా రెంటి ద్వారా మరిన్ని నిధుల్ని మునిసిపల్ స్థానిక ప్రభుత్వాలకు బదిలీ చేయాలి. ఇది ప్రభుత్వాల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడకుండా, చట్టబద్ధమైన ఏర్పాటుతో జరగాలి. ఇదేసమయంలో మునిసిపాలిటీలు తమ సొంత వనరులను పన్నుల సవరణ, పార్కింగ్ ఛార్జీల వసూలు వంటి వివిధ మార్గాల్లో పెంచుకునేందుకు వీలు కల్పించాలి.

నాలుగోది, మరింత మెరుగైన, సమ్మిళిత ఫలితాలు రావటానికి పౌరుల మేధో, సామాజిక వనరుల్ని పట్టణ పాలనలో వినియోగించుకునే ఏర్పాట్లు ఉండాలి. స్థానిక స్థాయిలో పౌరుల భాగస్వామ్యానికి కేరళ ఒక చెప్పుకోదగిన ఉదాహరణగా నిలుస్తోంది.

2050 నాటికి మన దేశ జనాభాలో దాదాపు 60 శాతానికిపైగా నగరాలలో ఉంటారని అంచనా. మనం పట్టణ పాలనకు పటిష్ట పునాది వేసి సరిదిద్దకపోతే నగరాలు నివాసయోగ్యం కాలేవు, నానాటికీ తరలివస్తున్న జనాభాకు జీవనోపాధికి అవకాశాల్ని అందించలేవు. నగర భారత కార్యాచరణకు భారత్ సిద్ధం కావాల్సిన సమయమిది.

# 'ఆర్థిక కేంద్రాలుగా చిన్న పట్టణాల అభివృద్ధి'..
# మౌర్య కృష్ణ వ్యాసంపై లోక్‌సత్తా టైమ్స్ టీం స్పందన

'భవిష్యత్తు గాంధీ గ్రామాల్లో లేదు.. ఆధునిక నగరాల్లో ఉంది' అన్న మౌర్య గారి వ్యాసం లోక్‌సత్తా భావజాలంతో ఏకీభవిస్తుంది. గాంధీ గారు గ్రామస్వరాజ్యాన్ని రొమాంటీకరించినా.. ఆయన ఉద్యమాలన్నీ నగరాల నుంచే జరిగాయి. ఆయన తొలిగా చేసిన హర్తాళ్, సహాయ నిరాకరణ ఉద్యమం, క్విట్ ఇండియా మూవ్‌మెంట్ ముంబయి మహానగరం నుంచే సాగాయి. అయితే లోక్‌సత్తా కార్యాచరణలోని ఇంకో కీలకమైన పాయింట్‌ను వ్యాసానికి జోడించాలనుకుంటున్నాం. ఒకరకంగా ఇది జోడించటం కూడా కాదు.. మౌర్య తన వ్యాసంలో సూచనప్రాయంగా చేసిన ప్రస్తావనను విస్పష్టంగా, ప్రాధాన్యతతో తెలియజేయటం. అదేమంటే, చిన్న పట్టణాల అభివృద్ధి!




15 లక్షలకు పైగా ఆవాసాలు, 6 లక్షల పైచిలుకు గ్రామాలున్న భారతదేశంలో నగరీకరణకు కేవలం నగరాలను పరిష్కారంగా చూపటం ఆచరణ సాధ్యం కాకపోవచ్చు. అందుకే ఒకపక్క నగరాలను మహానగరాలుగా, ఆర్థిక అభివృద్ధి ఇంజిన్లుగా విస్తరిస్తూనే (మహానగరాలు ఆర్థిక వృద్ధి ఇంజిన్లు అనడానికి ఐపీఎల్ మ్యాచ్‌లు నగరాల పేర్లతో ఏర్పడటం పాప్యులర్ ఉదాహరణ. హైదరాబాద్ సన్‌రైజర్స్, బెంగళూరు రాయల్ ఛాలెంజర్స్, ఢిల్లీ డేర్‌డెవిల్స్, చెన్నై సూపర్‌కింగ్స్, ముంబయి ఇండియన్స్ వగైరా టీమ్‌లు మహానగర భారతానికి అద్దం పట్టే క్రీడా వ్యాపారమే. పరిశేష ఆంధ్రప్రదేశ్‌లోని ఒక్క నగరం పేరు కూడా ఐపీఎల్‌లో లేదని, దీన్ని బట్టే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కేంద్రీకృత పాలన వల్ల ప్రస్తుత ఏపీ ప్రాంతం ఎంత నష్టపోయిందో అర్థమవుతుందని బాధపడుతున్నవారూ ఉన్నారు. విభజనతీరుపై తమకు ఇంత వేదన ఉన్నా కూడా ఇటీవలి ఏపీ ఎన్నికల్లో ప్రత్యేకహోదా, ఇతర విభజన హామీల అమలుపై పెద్ద చర్చ లేకుండా తమ ఓట్లు పిండుకున్న ఘనులు ప్రధాన పార్టీల రాజకీయ నాయకులు అని ప్రజానీకంలో ఎక్కువమంది ఇంకా స్పష్టంగా గుర్తెరగలేకపోతున్నారు) 20-30 గ్రామాలకు ఒక ఆర్థిక కేంద్రంగా చిన్న పట్టణాలను అభివృద్ధి చేయాలి. ఇలా దేశంలో 25,000 - 30,000 చిన్న పట్టణాలు వ్యవసాయాధారిత, వ్యవసాయేతర పరిశ్రమలతో ఆర్థిక కలాపాలను వృద్ధి చేసుకుంటూ వెళ్తుంటే, వలసలు పరిమితమై నగరాల మీద కూడా ఒత్తిడి తగ్గుతుంది.

వేలాదిగా చిన్న పట్టణాల అభివృద్ధి, ఎంపిక చేసిన మహానగరాలను గ్రోత్ ఇంజిన్లుగా అభివృద్ధి చేయటం.. ఇప్పుడు భారతదేశం ఎదుర్కొంటున్న పట్టణీకరణ సవాలుకు పరిష్కారం. దీనివల్ల కుల ప్రభావమూ తగ్గుతుంది. అందుకే తన భావజాలంలో, తాను పాల్గొన్న ప్రతి ఎన్నికలోనూ చిన్న పట్టణాల అభివృద్ధికి, వార్డు కమిటీల ద్వారా ప్రజల భాగస్వామ్యానికి ప్రాధాన్యతనిచ్చి ప్రచారం చేసింది (నగరాలు నివాసయోగ్యం కావటానికి పాలన ఎలా ఉండాలో చెబుతూ మౌర్య చేసిన సూచనలు యథాతథంగా చిన్న పట్టణాలకు కూడా వర్తిస్తాయి). 2009 ఎన్నికల్లో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ చేసిన రైలు యాత్ర ఎన్నికల ప్రచారంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలకు విడుదల చేసిన మేనిఫెస్టోల్లో చిన్న పట్టణాల అభివృద్ధికి నిర్దిష్ట హామీనిచ్చారు. తెలంగాణలో ప్రతి నీటి బొట్టునూ సద్వినియోగం చేసేలా చిన్న నీటి ప్రాజెక్టులను చేపట్టి, ప్రాణహిత-చేవెళ్ల (ఇప్పుడు కాళేశ్వరం) లాంటి ఆర్థికంగా లాభసాటిగాని అసంబద్ధమైన భారీ ప్రాజెక్టులకు బదులు అదే డబ్బుతో ఆర్థిక కేంద్రాలుగా పనిచేసే చిన్న పట్టణాలను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. రాష్ట్ర విభజన తర్వాత కూడా అమరావతికి భారీ ప్రణాళికల్ని రూపొందించి అన్నిటినీ అక్కడ కేంద్రీకరిస్తున్నప్పుడు కూడా జేపీ ఇదేమాట చెప్పారు. అమరావతిని హైదరాబాద్‌తో పోల్చటం తగదని, ఒక నగరం అభివృద్ధి కాలక్రమేణా ఆర్గానిక్ గ్రోత్‌లా జరగాలని, అందువల్ల పాలనా రాజధానిని ఆధునికంగా నిర్మించి, అమరావతిలో ఓ 5 లక్షలమంది నివసించేలా ఏర్పాట్లు చేయాలని, హైకోర్టును, ఇతర ప్రతిపాదిత నగరాలను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకూ విస్తరించాలని జేపీ సూచించారు.

అయితే కేంద్రీకృత పాలన, అభివృద్ధి నమూనానే ఇంకా కొనసాగిస్తుండటం వల్ల ప్రజల రోజువారీ జీవితంలో సౌకర్యాలు, ఆనందం మూల్యం చెల్లించాల్సి వస్తోంది. గ్రామాల్లో బతకలేక, నగరాల్లో ఇమడలేక దుర్భరజీవితం గడుపుతూ, స్మార్ట్‌ఫోన్లలో, మద్యం, ఇతర మత్తుల్లో, వినియోగ సంస్కృతి ఆకర్షణల్లో ప్రజలు తలదాచుకునే నమూనాను మన పాలకులు అనుసరిస్తున్నారు.

అనివార్యంగా జరిగే నగరీకరణను వలసలు అవసరం లేకుండా, గ్రామాల చుట్టూనే చేసే నమూనాను, స్థానిక ప్రభుత్వాల సాధికారతను సాధించుకోవటం కోసం ముఖ్యంగా యువత గట్టిగా పోరాడాలి. తెలుగు రాష్ట్రాల్లో స్థానిక ఎన్నికలు ఇందుకు చక్కటి అవకాశం. సరైన ఎజెండా చుట్టూ అనేక వివరాలను పట్టువిడవకుండా సేకరించి యువతకు స్ఫూర్తినిచ్చే వ్యాసం అందించినందుకు మౌర్యకు అభినందనలు. *

ఎంతో సాహసోపేతమూ, అసాధారణమూ అయిన రీతిలో వయోజనులందరికీ ఓటుహక్కును ఇచ్చిన దేశం భారత్! ప్రజాస్వామిక వ్యవస్థల అనుభవం లేని ఏ ఇతర పేద దేశమూ ఇలా తొలినుంచీ అందరికీ ఓటుహక్కును అప్పటిదాకా ఇవ్వలేదు. మన జాతీయోద్యమ నాయకత్వ ఘనత ఇది! పనిచేసే ప్రజాస్వామిక వ్యవస్థల్ని వాళ్లు విజయవంతంగా నిర్మించగలిగారు. కాబట్టే.. అసాధ్యమనిపించే అవరోధాలున్నా, స్వేచ్ఛను



# స్థానిక స్వయంపాలన లేని కేంద్రీకృత దుష్పరిపాలన ఇంకెన్నాళ్లు?

- డా॥ జయప్రకాష్ నారాయణ్

పరిరక్షించుకోగలిగాం, బ్యాలెట్ ద్వారా అధికారమార్పిడి శాంతియుతంగా జరుగుతూ వస్తోంది, విజయవంతమైన పరిణతిగల ఫెడరలిజం రూపుదిద్దుకుంది. ఊహకు కూడా అందని సంక్లిష్టతలు, భిన్నత్వంతో కూడిన అనేక తెగలు, కులాలు, భాషల మధ్య కూడా.. ఏదోకస్థాయి ఆర్థిక పురోగతి మన సమాజంలో కనిపిస్తోంది.

అయితే, మనం ఇంతకంటే మెరుగ్గా సాధించగలం గదా అని బాధపడనివారు మనలో దాదాపు ఉండరు. మన సామర్థ్యానికి, మన విజయాలకు మధ్య అంతరం అంత ఎక్కువగా ఉంది. తోటి దేశాలతో పోల్చి చూసుకుంటే.. మనం చాలా వెనకబడ్డాం. మన వైఫల్యాలకు మన ప్రజాస్వామ్యమే కారణమని కొందరు నిందిస్తుంటారు. శక్తిమంతమైన చైనాని, విజయవంతమైన సింగపూర్‌ని చూపిస్తూ.. అతి ప్రజాస్వామ్యం, రాజకీయాలు మనల్ని వెనక్కిలాగాయని వాపోతుంటారు. ఈ విమర్శలన్నీ శుద్ధ తప్పు అని ఏమాత్రం సంకోచించకుండానే తిప్పికొట్టచ్చు. అభివృద్ధి చెందిన అమెరికా, జపాన్ వంటివి ప్రజాస్వామ్య దేశాలు కావా?.. ప్రజాస్వామ్యానికి ప్రత్యామ్నాయం లేదు! ప్రజాస్వామ్యంలోని లోపాల్ని మరింత ప్రజాస్వామ్యంతోనే అధిగమించగలం తప్ప స్వేచ్ఛను కోల్పోయి మాత్రం కాదు.

ఒక పట్టణం, నగరంలోని కాలనీనో, గేటెడ్ కమ్యూనిటీనో, అపార్ట్‌మెంట్ సముదాయంలో ఉండే రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆర్‌డబ్ల్యుఏ)నో చూడండి. అక్కడుండే అన్ని ఇళ్లల్లోనివారు తమ ఉమ్మడి అవసరాలకు కొంత డబ్బును మెయింటినెన్స్ ఛార్జీల పేరుతో (పన్నుల మాదిరిగా) చెల్లిస్తారు. తాము ఖర్చు పెడుతున్న డబ్బుకు తగ్గ సేవల్ని (గేటు వద్ద సెక్యూరిటీ, సరైన పార్కింగ్, పనిచేసే లిఫ్ట్, రోజూ నీటి సరఫరా, ఆవరణలో మంచి రోడ్లు, డ్రైనేజీ, మురుగునీటి వ్యవస్థ వంటివి) కోరుకుంటారు. ఉమ్మడి సదుపాయాల్ని మెరుగుపరచటానికి నిర్మొహమాటంగా ఒత్తిడి తెస్తుంటారు. ఈ రకమైన నిర్వహణను ఎవరు సమర్థవంతంగా చేయగలరో, కమిటీని జవాబుదారీ చేయగలరో వారినే ఎన్నుకుంటారు. ఇంకోరకంగా చెప్పాలంటే, 'ఓటుకి – ఉమ్మడి ప్రయోజనాలు, నిర్వహణ ఛార్జీలు (పన్నులు), సేవలకు' మధ్య ఉండే స్పష్టమైన లింకులు అక్కడ వ్యవస్థీకృతమయ్యాయి. జవాబుదారీతనంతో కూడిన అధికారం అక్కడ స్పష్టంగా కనిపిస్తుంది. దీనివల్ల ప్రజాస్వామ్యం.. అక్కడున్న అందరి వ్యక్తిగతమైన పనిలా మారింది. అందరి ఉత్సాహపూరిత భాగస్వామ్యం ఉండటంతో అందరూ కోరుకునే, అందరికీ అవసరమైన ఫలితాలను ఇస్తోంది.

అలాగే మనలో పలువురు ఎంతో ఉత్సాహాన్ని ప్రదర్శించే అమెరికానే చూద్దాం. ఆ దేశంలో తుది నిర్ణయాధికారం మరీ ఎక్కువమంది చేతుల్లో

ఉంటుందని అంటుంటారుగానీ, వాస్తవానికి అక్కడ అధికార పరిధి పరిమితంగానే, సంబంధిత అంశంతో క్రియాశీల సంబంధమున్నవారి చేతుల్లో ఉంటుంది. అది కూడా అంతిమంగా రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛలకు లోబడే ఉంటుంది. వ్యవస్థలు, వికేంద్రీకరణ, జవాబుదారీతనంతో అక్కడ అధికారం ప్రజాస్వామ్యయుతంగా పనిచేస్తుంటుంది. అదే మనదేశంలో పరిస్థితి ఏమిటి? మన సువిశాలత్వం, భిన్నత్వంతో పోల్చి చూస్తే.. తుది నిర్ణయం తీసుకునేవారి సంఖ్య చాలా తక్కువగా కనిపిస్తుంది. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, అప్పుడప్పుడు జిల్లా మేజిస్ట్రేట్ లేదా సుప్రీంకోర్టు– వీళ్లే గదా భారత్‌లో నిర్ణయాలు తీసుకునేది! ఒక ప్రజాస్వామిక వ్యవస్థలో ఇటువంటి కేంద్రీకృత పాలన ఉంటే.. వ్యవస్థ అనివార్యంగా పనికిమాలినదిగా తయారై చతికిలపడుతుంది.

పైన చెప్పుకున్న అపార్ట్‌మెంట్ నిర్వహణ దగ్గర్నుంచి భారతదేశంలో ప్రతి గొప్ప విజయం కూడా స్థానిక స్థాయిలో లేదా కొన్ని రంగాలలో చొరవ, నాయకత్వం, అధికారాల బదిలీ, జవాబుదారీతనం, వనరుల వికేంద్రీకరణతో సాధించినవే. 'ఇస్రో', కురియన్ నిర్మించిన శ్వేతవిప్లవం, హరిత విప్లవం, సమర్థ ఎన్నికల నిర్వహణ, విపత్తులలో సహాయక చర్యలు, వీఐపీల సందర్శనల వంటి ఈవెంట్ మేనేజ్‌మెంట్ల నిర్వహణ లేదా అక్కడక్కడా అద్భుతాలు సృష్టిస్తూ మార్గదర్శకుల్లా ఉండే గొప్ప ఆవిష్కర్తల, అధికారుల అత్యుత్తమ పనితీరు– అన్నీ కూడా అధికారాల బదిలీ, స్థానిక నాయకత్వం, అధికారాన్ని– జవాబుదారీతనాన్ని మేళవించటం, సంబంధితుల్నందరినీ భాగస్వాముల్ని చేయటం వల్లే సాధ్యమయ్యాయి.

ప్రజాస్వామిక వికేంద్రీకరణ పట్ల మనం చాలాకాలంగా పైపై సానుభూతిని, మద్దతుని ప్రదర్శిస్తున్నాం. అందుకే అవి ఇంకా పూర్తిస్థాయి ఫలితాల్ని సాధించటంలేదు. ఫెడరల్ రాజకీయాల్లో మన రాష్ట్రాలు గతంలో ఎన్నడూ లేనంత బలంగా, స్వతంత్రంగా ఉన్నప్పటికీ.. అవసరమైన కీలక మార్పులకు అవకాశం మాత్రం రాష్ట్రాలకు ఇంకా లేదు. రాష్ట్రాల పాలనా వ్యవస్థ మొత్తాన్నీ రాజ్యాంగమే నిర్దేశిస్తుండటం ఇందుకు ప్రధాన కారణం. ఏ ఇతర ప్రజాస్వామ్య దేశంలోనూ ఫెడరల్ రాజ్యాంగం రాష్ట్రాల్లో ప్రభుత్వాధినేత (ముఖ్యమంత్రి) లేదా శాసనసభ ఎన్నికల విధానాన్ని, పాలనా యంత్రాంగం నిర్మాణాన్ని లేదా స్థానిక ప్రభుత్వాల రాజ్యాంగాన్ని శాసించదు. స్థానిక ప్రభుత్వాలను పటిష్టంగా పాదుకొల్పేందుకు మనదేశంలో ప్రయత్నాలు మొక్కుబడిగా ఉండటంతో.. అవి అయ్యవార్ని చేయబోతే ఏదో అయినట్లయ్యాయి. (73, 74 రాజ్యాంగ సవరణలు) మితిమీరిన నిర్మాణంతో, అధికారాలు లేని బలహీన, ప్రభావశూన్యమైన స్థానిక ప్రభుత్వాల్ని తయారుచేశాయి. రాష్ట్రాల శాసనసభ సభ్యులు, సీనియర్ ఉన్నతాధికారులే స్థానిక ప్రభుత్వాలకు బద్ధశత్రువులుగా మారారు. తమ ఎదుగుదలకు స్థానిక ప్రభుత్వాలను శత్రువులుగా వాళ్లు భావించారు. రాజ్యాంగ హోదా ఉన్నప్పటికీ స్థానిక ప్రభుత్వాలకి కేంద్రం (యూనియన్), రాష్ట్రాల నుంచి పన్నుల డబ్బు బదిలీలో గ్యారంటీ వాటా లేదు.. స్థానికంగా ఉండే రాజకీయ నాయకులు, అధికారుల తీరు పట్ల మనకేమీ రొమాంటిక్ అంచనాలు, అభిప్రాయాలు ఉండనక్కర్లేదు. అక్రమమైనా సంపాదించాలనే పేరాశ, ఓట్ల కొనుగోలు, అవినీతి, అసమర్థత ఇవన్నీ కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో ఉన్నట్టే స్థానిక స్థాయిలో కూడా ఉంటాయి. అయినా అదే పరిష్కారం, అదే (ఒకే ఒక్క) సమాధానం– స్థానిక ప్రభుత్వాలకి నిజమైన సాధికారత కల్పించటం, తగినన్ని వనరుల్ని వికేంద్రీకరించటం, జవాబుదారీతనాన్ని అమలుచేయటానికి స్వతంత్ర ప్రతిపత్తి గల అంబుడ్స్‌మన్‌ని ఏర్పాటు చేయటం! అప్పుడు మాత్రమే పౌరులు తమ ఓటుకు విలువనిస్తారు, తప్పుల నుంచి నేర్చుకుంటారు, తప్పుడు నిర్ణయాలకు మూల్యం చెల్లిస్తారు, ప్రజాస్వామ్యంలో నిజమైన భాగస్వాములుగా పరిణతి చెందుతారు.

వికేంద్రీకరణ కేవలం స్థానిక ప్రభుత్వాలకే కాదు.. అది ఫెడరలిజాన్ని బలోపేతం చేస్తూ రాజ్యాంగ స్వేచ్ఛలు, భారతదేశ ఐక్యత, సమగ్రత పరిధిలో రాష్ట్రాలకు కూడా విస్తరించే వెసులుబాటు కలిగినటువంటిది. సహకార సంఘాల నుంచి స్కూల్స్ వరకు, స్థానిక హౌసింగ్ కాలనీల నుంచి స్వయం సహాయక బృందాల వరకు, నీటి వినియోగదారుల నుంచి ఆరోగ్య సంరక్షణ సంస్థల వరకు విస్తరించగలిగినది.

ఈవేళ మనందరికీ తెలుసు.. చాలామంది పౌరులు ప్రభుత్వం నుంచి తమకు హక్కుగా అందాల్సిన సేవలకు బలవంతంగా లంచం ఇస్తున్నారు. మనకు రోజువారీ తప్పనిసరిగా అందాల్సిన మంచినీరు, విద్యుత్తు, రోడ్లు, డ్రైనేజీ, మురుగుపారుదల, విద్య, ఆరోగ్యం వంటి సేవలన్నీ అధ్వాన్న స్థాయిలో, ద్వితీయశ్రేణి ప్రజలకు దయదలచి విదిలిస్తున్నట్టు వున్నాయి. మన పన్ను డబ్బుల్లో చాలా మొత్తాన్ని తమ స్వార్థం కోసం, పక్షపాత రాజకీయ అవసరాల కోసం పందేరం చేస్తున్నారు. ఎవరు ఎన్నికైనా, మన జీవితాల్లో మనందరం సగర్వంగా, ఆదర్శప్రాయంగా చెప్పుకోగలిగిన నిజమైన మార్పు

మాత్రం ఉండదు. మంచి పాలన స్వయంపాలనకు ప్రత్యామ్నాయం కాదు కాబట్టే దేశం విడిచి వెళ్లాలని మన నాయకులు బ్రిటీషువాళ్లని అడిగారు. మరి ఈవేళ మన పోరాటం కేంద్రీకృత చెడ్డ ప్రభుత్వానికి – స్థానిక స్వయంపాలన ప్రభుత్వానికి మధ్యనే.

దేశానికి స్వతంత్రం వచ్చి డెబ్బై ఏళ్లు గడచిపోయాయి, 73, 74 రాజ్యాంగ సవరణలను పార్లమెంటు ఆమోదించి పాతికేళ్లు దాటిపోయాయి, స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు బదిలీ చేయాలని లోక్‌సత్తా కోటి 8లక్షల సంతకాల ఉద్యమాన్ని తెలుగు రాష్ట్రాల్లో చేపట్టి పదహారేళ్లు గడచిపోయాయి, జాతీయ సలహా మండలిలో, సదస్సులలో పలుమార్లు ప్రధానిస్థాయి వ్యక్తులకు నేను స్వయంగా వివరించినప్పుడు 'తప్పకుండా'.. అని యూపీయే, ఎన్డీయే తేడా లేకుండా హామీ ఇచ్చారు, కేంద్రంలో, తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ ఎన్నికలు వచ్చేశాయి, తెలంగాణలో రెండో శాసనసభ కూడా ఏర్పాటైంది – కేంద్రీకృత దుష్పరిపాలనా? స్థానిక స్వయంపాలనా? అంటే ఎంపికలో ఎవరికీ భిన్నాభిప్రాయం కూడా లేదు.. అయినా ఎందుకు సాధికార స్థానిక ప్రభుత్వాలను, వార్డు స్థాయి పాలనను మనం ఎందుకు ఏర్పాటు చేసుకోలేకపోతున్నామో నిజాయితీగా సమీక్షించుకోవాలి.

పాలకులు, పౌరసమాజం, మీడియా కదలాలి. ఈ దిగువ ఆచరణాత్మక మార్పులను అమలులోకి తెచ్చేలా గట్టి సంకల్పాన్ని ఇకనైనా ప్రదర్శించాలి. వేల ఏళ్ల భారతదేశ వికేంద్రీకరణ అనుభవాలు, ప్రపంచంలోని అత్యుత్తమ సంప్రదాయాలను ఆధారం చేసుకుని రాష్ట్రాలకు మరిన్ని అధికారాలను, స్థానిక ప్రభుత్వాలకు సాధికారతను ఇస్తూ ఫెడరలిజాన్ని విస్తరించాలి. మూడంచెల ఫెడరల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

మూడో అంచె ఫెడరలిజం కోసం రూపొందించిన వాటిలో కొన్ని ముఖ్యమైనవివి..

- కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రాలకు బదిలీ అయ్యే నిధుల్లో 33శాతానికి తక్కువ కాకుండా స్థానిక ప్రభుత్వాలకు వాటా ఇవ్వాలి. ఇప్పుడు ఈ వాటా కేవలం 7.3శాతం మాత్రమే. విచక్షణాధికారం పేరుతో స్థానిక ప్రభుత్వాల నిధులను దారిమళ్లించకుండా పకడ్బందీ ఏర్పాట్లు ఉండాలి.
- రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక ప్రభుత్వాలకు ఇచ్చే నిధుల్ని ప్రజల భాగస్వామ్యానికి వీలుగా 'తలసరి కేటాయింపు'తో రాష్ట్ర బడ్జెట్ నుంచే ఇవ్వాలి. స్థానిక పౌరబృందాలకూ నిధులుండాలి.
- స్థానిక ప్రభుత్వాలకు సాధికారతనిస్తూ అధికారాలను, నిధులను తప్పనిసరిగా బదిలీ చేసేలా రాజ్యాంగ సవరణ చేయాలి. స్థానికంగా ఉండే వారందరూ పాలనలో భాగస్వాములయ్యేలా ఈ చట్టం రూపకల్పన ఉండాలి. సంస్థాగత నిర్మాణానికి సంబంధించిన అన్ని వివరాలను రాష్ట్ర ప్రభుత్వాలకు వదిలేయాలి. ఈ రాజ్యాంగ సవరణకు రాజకీయ ఏకాభిప్రాయాన్ని సాధించేందుకు కృషి చేయాలి.
- ప్రతి జిల్లాలో, ప్రధాన నగరంలో అవినీతి నిరోధానికి స్వతంత్ర ప్రతిపత్తిగల సాధికార అంబుడ్స్‌మన్ వ్యవస్థను చట్టబద్ధంగా ఏర్పాటు చేయాలి.
- శాసన మండలి (ఉన్న రాష్ట్రాలలో)ని స్థానిక ప్రభుత్వాల మండలిగా చేయాలి. ఆర్టికల్ 171 కింద ఈ మార్పు చేసుకోవచ్చు.
- స్థానిక ప్రభుత్వాలకు కేంద్రం, రాష్ట్రాల స్థాయి సాధికారతను ఇచ్చేందుకు, పార్లమెంటుకి, శాసనసభకి, స్థానిక ప్రభుత్వాలకి ఒకే ఎన్నికల సంఘం, ఉమ్మడి ఓటర్ల జాబితాలు ఉండటం అవసరం.
- రిజర్వేషన్లను ఎన్నికైన కౌన్సిళ్లకు వర్తింపచేయాలి తప్ప కార్యనిర్వాహక ఛైర్‌పర్సన్లకు కాదు. దీనివల్ల సామాన్య ప్రజల నుంచి నాయకత్వం పెరిగి నిలదొక్కుకోగలుగుతుంది.
- 2009లో వచ్చిన 'గ్రామ న్యాయాలయాల' చట్టాన్ని 'స్థానిక న్యాయస్థాన' చట్టంగా అన్ని పట్టణ ప్రాంతాలకూ విస్తరించాలి.
- స్థానిక పోలీసులు చేసే చిన్న నేరాల విచారణ, ట్రాఫిక్ నిర్వహణ, గస్తీ, చిన్నచిన్న శాంతిభద్రతల సమస్యలు వంటివి స్థానిక నియంత్రణలో ఉండే ఏర్పాటు చేయాలి.
- అవకాశమున్నంత వరకూ విద్య, ఆరోగ్యం, విద్యుత్తు, నీటి సరఫరా, రహదారులు, స్థానిక పోలీసు, స్థానిక కోర్టులు, పౌరసేవలన్నీ ఒకే గొడుగు కింద ఉండాలి. పాస్‌పోర్టు సేవలను కూడా ఇందులో కలపొచ్చు. జర్మనీలో పాస్‌పోర్టు ఫెడరల్ ప్రభుత్వ బాధ్యతే అయినప్పటికీ, ప్రజలకు ఆ సేవను అందుబాటులోకి తెచ్చేది స్థానిక ప్రభుత్వమే.
- ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అందించే సేవలకి నిర్ణీత కాలవ్యవధిని ఏర్పాటు చేసి, ఆ గడువులోగా అందించలేకపోతే రోజుకి కొంత డబ్బుని జరిమానా చెల్లించేలా 'పౌర సేవల' (రైట్ టూ సర్వీసెస్/సర్వీస్ గ్యారంటీ/ఆర్‌టీఎస్) చట్టాన్ని అమలు చేయాలి. *

# రాజకీయ పార్టీల్ని రద్దు చేస్తే తప్పేమిటట!



- సత్యనారాయణ .వి,
taxpayers365@gmail.com

పార్టీ రాజకీయాన్ని కాకుండా పౌర రాజకీయాన్ని భారతదేశంలో పెంపొందించాలని మహాత్మాగాంధీ ఆశించినట్లు ఆయన మాటల్లో, చేతల్లో మనకు కొన్ని స్పష్టమైన దాఖలాలు కనిపిస్తాయి. ఆ ఉద్దేశంతోనే గాంధీజీ కాంగ్రెస్ పార్టీని కూడా రద్దు చేసి ఓ కొత్త స్వచ్ఛంద సంస్థలాంటి వేదికను రూపొందించాలని నిర్ణయించినట్లు చెబుతారు. ఇప్పుడు గాంధీ రాజకీయం పదేపదే ఎందుకు గుర్తుకొస్తోందంటే.. తెలుగు రాష్ట్రాల్లో, దేశంలో ఎన్నికలు జరుగుతున్న తీరు వల్ల!

2019 ఎన్నికల్ని చూస్తుంటే.. గాంధీగారి అభిప్రాయాలు మరింత గాఢతతో ప్రతిధ్వనిస్తున్నాయి.

మనం చాలా ఎన్నికల్లో, చాలాసార్లు ఒక మాట అనుకుంటున్నాం. "పార్టీలు గెలుస్తున్నాయి కాని ప్రజలు ఓడిపోతున్నారు" అని. మరి ప్రజలు గెలవాలంటే?.. పార్టీల్నే రద్దు చేస్తే ప్రజలు గెలవటానికి ఆటంకాలుండవని అనుకోవచ్చా?

జాతీయస్థాయిలో గానీ, రాష్ట్ర స్థాయిలో గానీ పార్టీల్ని స్థాపించేటప్పుడు.. 'ప్రజలకు ఏమి అవసరాలున్నాయి, ఎలాంటి సౌకర్యాలు కావాలి, ప్రజలు అభివృద్ధి చెందాలంటే ఏ కార్యక్రమాలు చేపట్టాలి, ఇందుకోసం ఏ పంథాను అనుసరించాలి' అని కొన్ని సిద్ధాంతాల్ని రచించి, దాని చుట్టూ విధానాలను ప్రతిపాదించి, చర్చించి, అవసరమైతే మార్పులు చేసుకుని, ఒక సమూహంగా రాజకీయ పార్టీని స్థాపిస్తారు. అప్పటికే ఉన్న రాజకీయ పార్టీలకి ప్రత్యామ్నాయంగా తమ విధానాలు ఉండేలా చూసుకుంటారు. ఆ సిద్ధాంతాలు ప్రజలలో బాగా ప్రాచుర్యం పొందితే ఆ పార్టీలో చాలామంది చేరతారు.. కానీ ఈ ఆరోగ్యకరమైన ప్రజాస్వామిక ధోరణి మనదేశంలో కాలక్రమంలో అనారోగ్యం పాలైంది.

ఒకరకంగా.. మనదేశంలో ఆరోగ్యకరమైన ప్రధాన పార్టీల వ్యవస్థ ఇప్పటిదాకా ఏర్పడలేదు. జాతీయోద్యమం నడిపిన పార్టీగా కాంగ్రెస్‌కు, నిజాయతీగా జీవితాల్ని సమాజం కోసం అంకితం చేసినందుకు అందులోని నాయకులకు ఉన్న గౌరవం చుట్టూనే మన పార్టీ రాజకీయం దశాబ్దాలపాటు నడిచింది. తొలితరం జాతీయోద్యమ నాయకులు కనుమరుగయ్యాక, ఆ డొల్లతనం బైటపడింది. సైద్ధాంతిక, విధానపరమైన బలంతో వ్యవస్థలను సమగ్రంగా ఏర్పాటు చేసి ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేయలేకపోయిన కాంగ్రెస్‌లో క్రమంగా విలువలు కూడా దిగజారటంతో సైద్ధాంతిక పైపూత కూడా కొట్టుకుపోయింది.

కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా వచ్చిన పార్టీలు కూడా ఇందిరాగాంధీని, కాంగ్రెస్‌ను గద్దె దించటం చుట్టూ తప్ప భారత్‌కు ఒక స్పష్టమైన రాజకీయ, పాలనా రోడ్‌మ్యాప్‌ని అందించి ప్రజాస్వామ్యాన్ని సంస్కరించే పనిచేయలేకపోవటం వల్ల సంక్షోభం ఉన్నకొద్దీ విస్తరిస్తూ "ప్రజాస్వామ్యం = ఎన్నికలు, ఓడిపోతే ఇష్టమొచ్చినట్లు అరవటం, గొడవలు చేయటం" అనే స్థాయి దగ్గర చతికిలపడిపోయింది.

ఎన్నికల్లో గెలవటానికి పార్టీలు రకరకాల తాత్కాలిక పద్ధతులను అనుసరించే క్రమంలో పలు చోట్ల ప్రాంతీయ పార్టీలు జాతీయపార్టీలని అధిగమించాయి. కానీ గల్లీ నుంచి ఢిల్లీ దాకా ఏ ప్రధాన పార్టీ.. జాతీయమైనా, ప్రాంతీయమైనా కూడా సైద్ధాంతిక, విధానబలంతో, ఇతర పార్టీలకి ప్రత్యామ్నాయంలా వ్యవహరిస్తున్న దాఖలా లేదు. ఒక పార్టీలో ఉన్న అత్యధిక కార్యకర్తలకు గాని, నాయకులకు గానీ ఆ పార్టీ సిద్ధాంతాలేమిటో తెలియదు. చివరకు పార్టీ అధ్యక్షుడికి కూడా పార్టీ సిద్ధాంతాలేమిటో తెలియని పరిస్థితి ఉంది. ఏదోక రూపంలో అధికారం తప్ప, ప్రత్యామ్నాయ విధానాలు లేకుండా పార్టీలు ఉన్నప్పుడు ఇన్ని పార్టీలు ఈ దేశంలో అవసరమా? పైగా, ఆ పార్టీల్లో నాయకులు కూడా దాదాపు వారే ఉంటారు. ఏ రోజు ఏ పార్టీతో డబ్బు, పదవిపరంగా లాభం ఉంటుందో దాంట్లోకి జంప్ అవుతుంటారు. కండువాలు మార్చుకుంటూ ఆ పార్టీ నుంచి ఈ పార్టీకి, ఇక్కడ్నుంచి ఇంకోపార్టీకి లేదా పాత పార్టీ గెలిస్తే మళ్లీ దాంట్లోకి గెంతుతుంటారు తప్ప, నాయకులుగా

మాత్రం వారే కొనసాగుతుంటారు. మహాఅయితే పార్టీ అధ్యక్షులు వంటి సారథులు మారకపోవచ్చు. ఎన్ని సమస్యలున్నా కూడా ప్రజల చేతుల్లో 'ఓటు' అనేది తిరుగులేని అస్త్రముంది అని ఊరట చెందటానికి కూడా వీల్లేని పరిస్థితులు దాపురించాయి. ఎంతో నమ్మకంతో ఓటు వేసినా కూడా.. ఆ అభ్యర్థి గెలిస్తే అదే పార్టీలో ఉంటాడని గ్యారంటీ లేదు.

దేశ రాజకీయాన్ని బాగు చేసి ప్రజలకు సుపరిపాలన అందించాల్సిన రాజకీయ పార్టీలే ఇలా తయారవటమంటే.. చికిత్స చేయాల్సిన, బతికించాల్సిన మందులే కాలం చెల్లిపోవటం వల్ల విషంగా తయారవటమన్నమాట. కాలపరిమితి దాటిన మందులు వాడితే ఎటువంటి అనర్థాలు వస్తాయో వేరే చెప్పనక్కర్లేదు. సిద్ధాంతాలు కొరవడిన పార్టీల వల్ల కూడా అనేక అనర్థాలు వస్తాయి.

ఈ పరిస్థితులకు తోడు విపరీతమైన అధికార కేంద్రీకరణ. శాసనసభ్యుడికి, మంత్రికి ముఖ్యమంత్రిని కాదనే ధైర్యం ఉండదు. ముఖ్యమంత్రికి తలగ్గి పనులు చేయించుకోవాలి. మరోపక్క ముఖ్యమంత్రికేమో శాసనసభ్యులంటే భయం. వారు గనక జారిపోయారంటే, తన పదవికే ఎసరొస్తుంది కాబట్టి.. రకరకాల హామీలు, పథకాలతో వారికి ప్రజాధనాన్ని లూటీ చేసే అవకాశాల్ని కల్పిస్తూ, ఎప్పటికప్పుడు మచ్చిక చేసుకుంటుంటారు. ప్రభుత్వంలోని అన్ని వ్యవస్థలూ ప్రజలు చెల్లిస్తున్న పన్నుల మీద ఆధారపడి నడుస్తున్నాయన్నది పచ్చినిజం. అయినా తామేదో దానకర్ణుల్లా, తమ జేబులో సొమ్మేదే ప్రజలకు దానం చేస్తున్నట్లుగా, వరాలిస్తున్న దేవుళ్లలా వీరు ఫోజులిస్తూ ప్రజల్ని యాచకుల్లా కొనసాగిస్తూ ఎన్నికల్లో లబ్ధిపొందటానికి రకరకాలుగా ప్రయత్నాల్ని చేస్తున్నారు.

చూడండి..

- పార్టీలకు సిద్ధాంతాలు లేవు,
- పార్టీల పద్ధతుల్లో, నాయకుల్లో ఏమాత్రం తేడా లేదు, ప్రత్యామ్నాయం లేదు, అంతా ఒకే తానులో ముక్కలు,
- ఏ పార్టీకి ఓటేసినా చివరికి అధికార పార్టీకే ఓటు పడుతుందన్నట్లు.. సొంత లాభాల కోసం గెలిచినవారంతా పార్టీలు ఫిరాయించేస్తున్నారు,
- కేంద్రీకృత పాలన, ఎమ్మెల్యేలు, మంత్రులు ముఖ్యమంత్రికి తలొగ్గటం,
- ఎమ్మెల్యేలను మచ్చికచేసుకోవటానికి రాజకీయ అవినీతిని ముఖ్యమంత్రే పరోక్షంగా ప్రోత్సహించటం

.. ఇలాంటప్పుడు ఇప్పుడున్న రాజకీయ పార్టీల వల్ల ఉపయోగమేంటి? ప్రస్తుత ఎన్నికల వ్యవస్థ వల్ల ఎంత నష్టం జరుగుతోంది?– వీటిని మనం సీరియస్‌గా ఆలోచించాలి.

ఒక పార్టీకి, ఇంకో పార్టీకి సిద్ధాంతాల్లో, విధానాల్లో తేడా లేనప్పుడు.. సమర్థత, నిజాయతీ ఉన్నవారు ఏ కుటుంబంలో పుట్టినా వేగంగా ఎదిగే ఏర్పాట్లు రాజకీయ పార్టీల్లో లేనప్పుడు– ఆ పార్టీల్ని రద్దు చేసినా నష్టం లేదు.

అలా పార్టీలన్నీ రద్దయినా, ముఖ్యమంత్రిని ప్రత్యక్షంగా ఎన్నుకుంటూ శాసనసభ్యులందర్నీ కూడా ఇండిపెండెంట్లుగా ఎన్నుకుంటే.. మన పాలన ధోకా లేకుండానే కొనసాగుతుంటుంది. పైగా మెరుగ్గా కూడా ఉంటుంది. ఎమ్మెల్యేల ద్వారా కాకుండా, ప్రజల నుంచి ప్రత్యక్షంగా ఎన్నికైన ముఖ్యమంత్రి.. సమాజంలో సమర్థుల్ని, నిష్ణాతుల్ని పార్టీ రాజకీయాలతో సంబంధం లేకుండా తన కేబినెట్‌లోకి మంత్రులుగా తీసుకుంటారు. అలాగే శాసనసభలో బలంగా గళాన్ని వినిపించటం ద్వారా ముఖ్యమంత్రి అతిపోకడల్ని ఎమ్మెల్యేలు నియంత్రిస్తారు, సరైన చట్టాల్ని తీసుకొస్తారు.

అంటే, ఉన్న పార్టీలకు ప్రత్యామ్నాయం గురించి ఆలోచించటం కంటే.. 'ప్రత్యామ్నాయ రాజకీయం' గురించి ఇప్పుడు ప్రజలు, పౌరసమాజం, రాజకీయ పార్టీల్లోని విజ్ఞులు ఆలోచన చేయాలి. ఇలా కొంతకాలం చేస్తే, ప్రజల ఆస్తిగా ఉండే లోక్‌సత్తా లాంటి పార్టీలు రూపుదిద్దుకుంటాయి, బలపడతాయి, ఆరోగ్యకరమైన విధానాలతో ప్రజలను సమీకరిస్తాయి (ప్రజలను సమీకరించటం రాజకీయ పార్టీల వల్ల ఉండే పెద్ద ప్రయోజనం). తమ ఓటుకు–తాము కడుతున్న పన్నుల డబ్బుకు మధ్య సంబంధం అర్థమై ప్రజలు కూడా ప్రలోభాలకు లోనుకాకుండా ఓటును సద్వినియోగం చేసుకునే దిశగా ఎన్నికలు జరగటం మొదలవుతుంది. అప్పుడే మనం తరచూ అనుకునే 'పార్టీలు గెలుస్తున్నాయిగానీ ప్రజలు ఓడిపోతున్నారు' అన్న స్లోగన్ అవసరం ఉండదు.

రాజకీయ పార్టీల్ని, ఎన్నికల వ్యవస్థని ప్రక్షాళన చేసే ప్రత్యామ్నాయ రాజకీయాన్ని తెచ్చుకోకపోతే.. ఓటు అనే అస్త్రంతో కూడా మనల్ని మనం కాపాడుకోలేని నిస్సహాయ ప్రజాస్వామిక దశలోకి జారిపోయే ప్రమాదాన్ని ఎదుర్కోవలసి ఉంటుంది.

- **ఐదేళ్లకోసారి వేసే ఓటు కోసం - ప్రతిరోజూ పార్టీరాజకీయాలే మాట్లాడుతున్నాం**
- **ప్రతిరోజూ మనం కట్టే పన్నుల డబ్బు గురించి- ఒక్కరోజైనా మాట్లాడుతున్నామా?**

*




సాగుతున్నాయని జేపీ అన్నారు. దేశాన్ని, ప్రపంచాన్ని మార్చే శక్తి నేటి యువభారతీయులకు ఉందని, గతంలో ఎన్నడూ లేనిరీతిలో టెక్నాలజీ ఈతరానికి అందుబాటులోకి వచ్చిందని అన్నారు. మనం ఏ రంగంలో ఉన్నా పరిష్కారంలో భాగస్వాములం కావాలని, కానీ దురదృష్టవశాత్తూ నూటికి 90 మంది సమస్యలో భాగస్వాములవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రాజకీయాల్లోకి గొప్ప నాయకులు వచ్చినా.. ఒక్క రాజకీయ

# అధికారోన్మాదం ఆవహించింది!

ఈవేళ మన సమాజాన్ని అధికారం అనే ఉన్మాదం ఆవహించిందని, విజ్ఞత గల ఏ దేశంలోనూ అధికారానికి ఇంత 'గిరాకీ' ఉండదని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ అన్నారు.

పోటీ పరీక్షలకు శిక్షణనిచ్చే ఒక ప్రైవేటు విద్యాసంస్థ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో జరిగిన విద్యార్థుల ముఖాముఖి కార్యక్రమంలో జయప్రకాష్ నారాయణ్ పాల్గొన్నారు.

ఉమ్మడి సౌకర్యాలను మన నిధులతో ఏర్పాటు చేసుకునే వ్యవస్థనే ప్రభుత్వం అనాలని, ఇందులో ప్రజలు ప్రభువులుగా, పాలకులు సేవకులుగా ఉంటారని, అయితే ప్రజాస్వామ్యం ముసుగులో బానిస సమాజాన్ని ఏర్పరచుకునేలా మన ఎన్నికలు, రాజకీయ కార్యక్రమాలు, పాలనా పద్ధతులు నాయకుల వల్లో, అధికార యంత్రాంగం వల్లో మార్పు వస్తుందని ఆశించవద్దని జేపీ హితవు పలికారు. సాధారణ పౌరులు ఓటు విలువను తెలుసుకుని, ఓటుకు - తాను కట్టే పన్నుల డబ్బుకి - తన జీవితానికి గల సంబంధాన్ని అర్థం చేసుకుని ఓటు వేస్తేనే మార్పు మొదలవుతుందన్నారు.

ఇప్పటివరకూ తెలుగునాడుకు ముఖ్యమంత్రులుగా చేసినవారిలో జలగం వెంగళరావును తాను అభిమానిస్తానని ఓ ప్రశ్నకు సమాధానంగా జేపీ చెప్పారు. వనరుల వినియోగంలో ఆయన సమర్థుడన్నారు. పోటీ పరీక్షల శిక్షణా సంస్థ నిర్వాహకుడు కృష్ణ ప్రదీప్ మాట్లాడుతూ, మంచి పాలనను అందించడానికి రాబోయే తరాన్ని సిద్ధం చేయడమే తన లక్ష్యమన్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ నాయకులు పాల్గొన్నారు. *



"సంపూర్ణమైన అవగాహనతో, సమతూకంతో చేసే ఆరోగ్యకరమైన విమర్శ ఒక్కటే ప్రజా జీవితానికి రక్షణ ఛత్రం లాంటిది. మన పర్యావరణానికి ఓజోన్ పొర ఎంతో రాజకీయాలకు ఇదంత ముఖ్యం!"

\- మహాత్మా గాంధీ

# ‘ఉక్కు’చట్రానికి బీటలు?

- మద్దిపట్ల మణి

*మన దేశంలోనే అత్యున్నత స్థాయి పరీక్ష సివిల్స్. దేశవ్యాప్తంగా లక్షల సంఖ్యలో యువత ఈ పరీక్షకు పోటీపడతారు. అందులో టాప్‌లో ఉన్న వంద నుంచి రెండు వందల లోపు మందికి మాత్రమే ఐఎఎస్ వస్తుంది. అధికారులుగా తొలిరోజుల్లో చాలా పద్ధతిగా ఉంటారు. ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా, ముక్కుసూటిగా పని చేస్తారు. దురదృష్టవశాత్తు కొద్దికాలానికే మన వ్యవస్థ, ముఖ్యంగా పాలకులు వారిని దిగజారుస్తారు.*

ఇందిరాగాంధీ ప్రిన్సిపల్ కార్యదర్శిగా ఉన్న మొదటి బ్యాచ్ ఐఎఎస్ అధికారి పి.సి అలెగ్జాండర్ తరవాతి రోజుల్లో తమిళనాడు, మహారాష్ట్ర గవర్నర్‌గా పనిచేశారు. వాజపేయి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి పదవికి ఆయన్ను సిఫార్సు చేసినప్పటికీ కాంగ్రెస్ పార్టీ అంగీకరించలేదు. తదుపరి రాజ్యసభ సభ్యుడిగా పనిచేసిన ఆయన పత్రికల్లో కాలమ్ నడుపుతుండేవారు. తొలి బ్యాచ్ ఐఎఎస్ అధికారిగా శిక్షణలో ఉన్నప్పుడు అప్పటి కేంద్ర హోం మంత్రి సర్దార్ పటేల్‌ను కలిసిన సందర్భంలో చోటుచేసుకున్న విశేషాలను ఒక వారంత వ్యాసంలో హృద్యంగా వివరించారు. అప్పటికే అవసాన దశలో ఉన్న పటేల్‌ను ఆయన ఇంట్లోనే ట్రైనీ ఐఎఎస్‌లు కలిశారట. ఐఎఎస్ అధికారులు పాటించాల్సిన విద్యుక్త ధర్మాలను నిదానంగా అయినా పటేల్ చాలా స్పష్టంగా చెప్పారట. ‘సంస్థానాలుగా ఉన్న మనం ఇప్పుడే భారతదేశంగా ఏకమయ్యాం. మళ్ళీ ముక్కలు చెక్కలు అయ్యే పరిస్థితి ఉండకూడదు. అఖిల భారత స్థాయి అధికారులుగా దేశాన్ని ఒకే తాటిపైకి తీసుకురావాల్సిన కర్తవ్యం మీ మీద ఉంది. పాలకులు ప్రతి అయిదేళ్ళకు మారుతుంటారు. మీ నేతృత్వంలోని అధికార యంత్రాంగం కలకాలం ఒకే తీరులో, అదీ ప్రజల ప్రయోజనాలను కాపాడే పద్ధతిలో ధర్మబద్ధంగా సాగాలి. దేశంలో ఏ ప్రాంతంలో అయినా పనిచేసేందుకు సర్వదా సన్నద్ధులై ఉండాలి. ఇందుకోసం మీకు ఇతోధిక అధికారాలే కాదు, తగు రక్షణను సైతం కల్పించాం. ఎవ్వరికీ భయపడవద్దు. దేశ సమగ్రత, సౌభాగ్యమే మీ కర్తవ్యం కావాలి’ అని పటేల్ చాలా చక్కగా వివరించారట. అంతటి మహోన్నత వ్యవస్థ కొద్ది బుద్ధులు ఉన్న కొందరి నిర్వాకంతో దిగజారుతోందంటూ అలెగ్జాండర్ తన వ్యాసాన్ని ముగించారు. దాదాపు పదేళ్ళ క్రితం ఒక దినపత్రికలో ఆయన రాసిన వ్యాసమిది.




ప్రతిసారి ఎన్నికల సమయంలో ఈ వ్యాసం గుర్తుకు వస్తూ ఉంటుంది. ఓట్లు గల్లంతయ్యాయన్నది ఎప్పుడూ వినిపించే ఫిర్యాదు. తెలంగాణ శాసనసభ ఎన్నికల సమయంలోనూ లక్షల మంది ఓట్లు గల్లంతయ్యాయి. ఎలక్షన్ కమిషనర్ ముచ్చటగా సారీ చెప్పి దులిపేసుకున్నారు. తాజాగా ఈవీఎంల పనితీరుపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. మనదేశంలో ఎన్నికల వ్యవస్థ సీనియర్ ఐఎఎస్ అధికారుల చేతుల్లో ఉంటుంది. ఎన్నికల సమయంలో తిరుగులేని అధికారాలు వారికి ఉంటాయి. వారి ఆదేశాలు అందరికీ శిరోధార్యం. ప్రధాని సహా ఎవరూ అడ్డుకోలేని, ఏమీ చేయలేని పరిస్థితి. అయినప్పటికీ, సదుపాయాలు కాదు, కనీసం ఓటు హక్కు కల్పించలేని స్థితిలో ఎన్నికల యంత్రాంగం ఉంది. ఐఎఎస్ అధికారులు ఏవేవో కేసుల్లో ఇరుక్కున్నారంటే, పాలకుల ఒత్తిళ్ళ వల్ల చిక్కుకున్నారని అనుకోవచ్చు. ఏ పని చేయాలన్నా మధ్యలో పొలిటీషియన్లు అడ్డుపడుతున్నారంటే అర్థం చేసుకోవచ్చు. ఎలక్షన్ కమిషన్ తడాఖా చూసిన టిఎన్ శేషన్ కూడా ఐఎఎస్ అధికారే. ఆయన రగిలించిన స్ఫూర్తి రాన్రాను ఎందుకు ఆవిరి అవుతోందన్నది ప్రశ్న. బలపడాల్సిన ఎన్నికల వ్యవస్థ ఎందుకు బలహీనపడుతోందన్నది మరో ప్రశ్న.

ఈ సందర్భంలోనే రిటైర్డ్ ఐఎఎస్ అధికారి, లోక్‌సత్తా

వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ మాటలు గుర్తుకు వస్తుంటాయి. కూకట్‌పల్లి శాసనసభ్యుడిగా ఎన్నికైన తొలిరోజుల్లో చెన్నైలో ఒక తెలుగు సంఘం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ ఏడాది పది మంది వరకు తెలుగు ప్రాంతాలకు చెందిన యువకులు ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. వారిని సన్మానించడానికి ఉద్దేశించిన కార్యక్రమం అది. 'మన దేశంలోనే అత్యున్నత స్థాయి పరీక్ష సివిల్స్. దేశవ్యాప్తంగా లక్షల సంఖ్యలో యువత ఈ పరీక్షకు పోటీపడతారు. అందులో టాప్‌లో ఉన్న వంద నుంచి రెండు వందల లోపు మందికి మాత్రమే ఐఏఎస్ వస్తుంది. అధికారులుగా తొలిరోజుల్లో చాలా పద్ధతిగా ఉంటారు. ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా, ముక్కుసూటిగా పని చేస్తారు. దురదృష్టవశాత్తు కొద్దికాలానికే మన వ్యవస్థ, ముఖ్యంగా పాలకులు వారిని దిగజారుస్తారు. మొదట్లో ఉండే ఉత్సాహం తగ్గుతుంది. నలుగురిలో నారాయణ అనుకుంటారు. సరిగ్గా పదేళ్ళకు వారిలో ఎక్కువమంది దిగజారిన వ్యవస్థకు బందీలవుతారు. మరికొంతమంది అవినీతి కూపంలో ఇరుక్కుంటారు. కోర్టుల చుట్టూ తిరుగుతారు. ఇంతోటిదానికి దేశవ్యాప్తంగా పరీక్ష, అందులో మళ్లీ మొదటి వరుసలో ఉండటం అవసరమా అన్నది నా ప్రశ్న. చుట్టూ సంకెళ్ళను అమర్చి, ఎటూ కదలలేని పరిస్థితులు కల్పిస్తే వారు మాత్రం ఏమి చేస్తారని' సభాముఖంగా ఆవేదన వ్యక్తం చేశారు. ఈరోజూ అదే పరిస్థితుల్లో ఐఏఎస్ అధికారులు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఎన్నికల నిర్వహణే అని కాదు, ఎందులోనూ సఫలంకాని స్థితిలో అధికార యంత్రాంగమే ఉంది.

నిజానికి ఏటా ఐఏఎస్‌కు ఎంపికైన అభ్యర్థులు మీడియాకు చెప్పే మాటల్లో ఎంతో ఆశావహ పరిస్థితి కనిపిస్తూ ఉంటుంది. అమ్మా, నాన్న, చదువుకున్న ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ తమను సివిల్స్ వైపు పురికొల్పాయని కొందరు చెబుతూ ఉంటారు. వ్యవస్థను చూసి ఆందోళన చెందబోము, సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని అంటుంటారు. తినడానికి తిండి కూడా లేని పరిస్థితుల నుంచి కొందరు ఎంతో కృషి చేసి ఐఏఎస్‌కు ఎంపికవుతుంటారు. దాదాపుగా అన్ని నేపథ్యాలకు చెందిన యువత ఎన్నో సంవత్సరాలు కష్టపడి చదువుతారు. దేశంలో అత్యంత కఠినమైనదిగా పేరు పొందిన ఎంపిక ప్రక్రియలో భాగంగా ఏడాది పాటు సాగే ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ.. మూడు దశల్లోని పరీక్షలను ఎన్నో కష్టాలు పడి విజయవంతంగా దాటుకుని మరీ వస్తారు. ముస్సోరిలోని అకాడమీలో అత్యుత్తమమైన శిక్షణ పొందిన యువత, పాలనలోకి వచ్చిన కొద్ది సంవత్సరాలకే నిర్వీర్యం కావడం దురదృష్టకరం. వారిని మరో ఇరవై నుంచి ముప్పయ్యేళ్ళు భరించడం వ్యవస్థ చేసుకున్న దౌర్భాగ్యం. పటేల్ నిర్మించిన ఉక్కుచట్రం బీటలు వారుతూ ఉండటం అన్నింటికీ మించిన విషాదం కాదంటారా? పటేల్ కోరుకున్న స్థాయిలో దీన్ని పటిష్ఠవంతమైనదిగా మార్చుకోలేమా? *

*(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)*

# జిల్లాకు జలగండం.. తక్షణం స్పందించండి!



విజయనగరం జిల్లా మునుపెన్నడూలేని స్థాయిలో తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటోందని, దీనిపై తక్షణ చర్యలు చేపట్టాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ జిల్లా యంత్రాంగాన్ని కోరారు. పార్టీ నేతలతో కలిసి ఇంఛార్జి/ జాయింట్ కలెక్టర్ వెంకటరమణారెడ్డి దృష్టికి వివరాల్ని తీసుకెళ్లారు. అనంతరం మాట్లాడుతూ, ముఖ్యంగా జిల్లాలోని ఎనిమిది మండలాల్లో, నాలుగు మునిసిపాలిటీల్లో నీటి సమస్య తీవ్రంగా మారిందన్నారు. పలు గ్రామాల్లో నీటి వనరులు ఉన్నా కూడా బోర్లు పనిచేయక నీటికి అవస్థలు పడుతున్నారన్నారు. నీటిపథకాలపై తక్షణం సమీక్ష జరిపి చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. లోక్‌సత్తా పార్టీ నాయకులు చప్ప మధు, దవులూరి రమేష్, నాగభూషణం, చిన్నారావు, రాజారావు, ఆదీశ్వరరావు, పీఎల్ఎన్ రాజు, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

# అధికారిక సేవాభాగ్యం

- వేణుబాబు మన్నం

తెలుగు రాష్ట్రాల్లో నేతల కళ్ల వెంట ఆనంద బాష్పాలు ఆగడం లేదు. వాళ్ల మానసాలు ఆనంద డోలికల ఓలలాటల నుంచి బయటకు రావడం లేదు. ఇన్నాళ్లకు తమను సరిగ్గా అర్థం చేసుకున్న వ్యక్తి కనిపించినందుకు వాళ్ల ఆనందానికి పట్టపగ్గాలు లేకుండా పోయాయి. ఒక రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి తమ త్యాగాన్ని చక్కని ఉపమానంతో వర్ణించినందుకు నిద్రలో కూడా వాళ్ల ముఖాల మీద సంతృప్తికర నవ్వులు చెక్కుచెదరడం లేదు.

సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఆ మధ్య హైదరాబాదులో విలేకరులకు కార్యశాల నిర్వహించారు. ఎన్నికల్లో అభ్యర్థుల 'అనధికార' ఖర్చు గురించి తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిని ఎవరో ప్రశ్నించారు. 'పది వేలమందికి భోజనం పెట్టి, వందమందికే పెట్టినట్లు లెక్కలు చూపిస్తే.. తాము నమ్మక తప్ప'దని వెంటనే ఆయన ప్రసన్నవదనంతో సెలవిచ్చారు. అంతే, ఆ మాటతో స్వర్గంలో కర్ణుడు ఉలిక్కిపడ్డాడు. శిబి చిన్నబోయాడు. దధీచి దిక్కులు చూశాడు. తండోపతండాలుగా నేతలు తమకు పోటీ వస్తున్నందుకు వాళ్లకు ఏం చేయాలో పాలుపోక పక్కపక్కన చేరి పీకల్లోతు చర్చల్లో మునిగిపోయారు.

ఆయన ఒక ఐఏఎస్ అధికారే. అయినా అంతకు మించి మనసున్న మనిషి. నేతల త్యాగాలు గుర్తించడంలో ఒక నిలువెత్తు వెండికొండ. మరి, పదివేల మందికి 'అన్నం' పెట్టి, వందమందికే పెట్టినట్లు చెప్పుకోవడమంటే మాటలా! దానికి ఎంత విశాల హృదయం ఉండాలి. మనసు నిండా త్యాగం ఎంతగా మేటకట్టి ఉండాలి. కొండ అద్దమందు కొంచెమై ఉ ండదా అన్న విషయాన్ని గుర్తించడమంటే మాటలా?

ఇప్పటివరకు మన భారతదేశ చరిత్రలో ఏ ఎన్నికల అధికారి అయినా నేతల 'ఎన్నికల ఖర్చు'ను ఇంత చక్కగా వర్ణించారా? అసలు ఆయన మనసు ఎంత స్వచ్ఛం కాకపోతే మొన్నటి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో లక్షల సంఖ్యలో ఓట్లు గల్లంతైనప్పుడు ప్రజలకు బహిరంగ క్షమాపణ చెబుతారు! ఇంకోసారి ఇలా కాకుండా చూసుకుంటామని 'భరోసా' ఇస్తారు. అయితే ఈ కార్యశాలలో మాత్రం లక్షల సంఖ్యలో ఓట్ల గల్లంతు అవాస్తవమని, అదంతా మీడియా సృష్టి అని, పైగా ఓటు కోల్పోవడంలో ప్రజల బాధ్యతారాహిత్యమూ ఉందని చెబుతూ తన 'స్వచ్ఛమైన నిబద్ధత'ను చాటే ప్రయత్నం చేశారు.




అసలు ఎన్నికలు వచ్చాయంటేనే బిర్యానీలు, ఇంటింటికీ కేజీ చొప్పున రెండు మూడు రోజుల పాటు చికెన్లు, అయిదొందలు రెండువేల నోట్లు (నచ్చింది కొనుక్కునో, చేసుకునో ఎంచక్కా తినొచ్చు) ఇలా ఎంత 'అన్న సేవ'. ప్రచారంలో జెండాలు మోయడం, స్తంభాలకు పార్టీ పతాకాలు కట్టడం–నేతలకు జేజేలు కొట్టడం ఎంతమంది నిర్భాగ్యులకు పని! వాళ్లకు రోజూ బిర్యానీలు, కావాలంటే మందు, డబ్బులు... అబ్బో, ఎన్నికలంటే 'అన్న' సమారాధనే. అది నాలుగు రోజుల సంబడమే అయినా కోట్లతో వ్యవహారం. కానీ, ఈ విషయాన్ని పక్కన పెట్టి, తమ 'దానఖ్యాతి'ని నేతలు తగ్గించి చెప్పుకోవడమంటే మామూలు విషయమా! ఆ మాటకొస్తే నికార్సైన 'ప్రజాసేవ' అంటే ఇదే!

నిజానికి, ఎన్నికల్లో ఓటర్లకు 'అన్నం' పెట్టడమంటే వాళ్లను మభ్యపెట్టడం, తమ దారిలోకి తెచ్చుకోవడం, అలా ఎన్నికల తతంగాన్ని అపహాస్యం చెయ్యడం, ప్రజాస్వామ్యాన్ని బందపెట్టడం. ఎన్నికల సమయంలో నేతల యావ అంతా– ఓటర్లు తమ పార్టీ గుర్తు మీద నొక్కేలా 'ఈవీఎం'ల వైపు నడిపించడానికే. అయితే కానివ్వండి, 'అన్నం' సాక్షాత్తూ పరబ్రహ్మ స్వరూపం కాబట్టి– అది పరబ్రహ్మ సేవే.

డెబ్భై ఏళ్ల స్వతంత్ర భారతావనిలో ఇప్పటికీ 'అన్నం' కోసం అల్లాడేవాళ్లు ఎందరో. ఆ విషయం గుర్తెరిగి, నేతల 'దాన' గుణాన్ని చక్కగా ఉదహరించారు ఆ అధికారి. ఇంత గొప్ప 'సేవ' చేస్తున్నారు కనుకనే, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల ఖర్చుల వివరాలు తమకు పంపారా లేదా అన్నదే చూస్తామన్నారు. అవి సరైనవా కాదా అన్నది ఎన్నికల సంఘం బాధ్యత కాదని కార్యశాలలోనే తేల్చి చెప్పేశారు. ఇక

*నిబంధనలంటూ కొన్ని ఉన్నాయి కాబట్టి, వాటిని కాదనలేం కాబట్టి, 'పదివేల మందికి భోజనాలు పెట్టినట్లు ప్రత్యర్థులు, ప్రజల వద్ద ఆధారాలుంటే కోర్టుకు వెళ్లచ్చు' అనీ అన్నారు. నేతల 'దానశీలత'ను ఆయన అంతగా వివరించి చెప్పిన తరువాత కోర్టులకు వెళ్లేవాళ్లు కఠినాత్ములే!*

*మొత్తానికి ఆ ఉన్నతాధికారి మాటలు విన్న తరువాత చాలా విషయాలను మనం పునస్సమీక్షించుకోవాల్సిందే. భగవద్గీత కూడా 'అన్నం' నుంచి ప్రాణులు ఉత్పన్నమవుతున్నాయి. మేఘం వలన అన్నం సమకూరుతుంది. యజ్ఞం వలన మేఘం ఏర్పడుతుంది. యజ్ఞం కర్మ వలన కలుగుతోంది' అని చెబుతోంది. ఇక మీద 'నేతల వలన అన్నం సమకూరుతుంది. ఎన్నికల వలన నేతలు వస్తారు. వారి పుణ్యం వలన ఎన్నికలు వస్తాయి' అని అభినవ గీత పఠించాల్సిందే.*

*అసలు నేతలు ఎన్నికల్లో 'అన్న' సంతర్పణలు చేసేదెందుకు-గెలిచేటందుకు... ఆ తరువాత పెట్టిన ఖర్చు మొత్తాన్ని ప్రజాస్వామ్యం కళ్లుగప్పి స్వాహా చేసేటందుకు! కానీ, ఆ ధనమంతా ఎక్కడికి పోతుంది? మళ్లీ వచ్చే ఎన్నికల్లో 'గుప్త అన్నం'గా ప్రజల దగ్గరికే వస్తుంది. ఆ తరవాత మళ్లీ 'స్వాహా', మళ్లీ 'దానం'. పునరపి జననం, పునరపి మరణ చక్రంలా... ఇదో 'దోపిడి-సేవ'ల చక్రం. కానీ, ఇందులో ఓటర్లు మాత్రం ఎప్పుడూ యాచకులే!*

*అయితే కానివ్వండి. అసలు 'అన్నదాన'మంటే మాటలా? అది దానాల్లోకెల్లా గొప్పది. మనిషిలో అణువణువునా నిండిన ఆత్మారాముణ్ని సంతృప్తిపరచేది. అంత మహోన్నత 'సేవ' చేస్తున్న నేతల గొప్ప మనసును ఆ ఎన్నికల అధికారి చక్కగా తెలియజెప్పారు. అందుకు ఈ ప్రజాస్వామ్య స్వేచ్ఛా పవనాలు పీలుస్తున్న మనమంతా సంబరపడాల్సిందే!* *

*(ఈనాడు సౌజన్యంతో)*

## ప్రతిపక్షాల్ని కాదు.. సమస్యల్ని లేకుండా చేయండి



**కూ**కట్‌పల్లి నియోజకవర్గంలో ప్రజలకు తాగేందుకు నీళ్లు కూడా దొరకని ఇబ్బందికర పరిస్థితి దాపురించిందని లోక్‌సత్తా నియోజకవర్గ అధ్యక్షుడు వంశీప్రసాద్ అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని పథకాలను ప్రవేశపెట్టినా, తాయిలాల్ని పందేరం చేస్తున్నా.. జనానికి కావలసిన కనీస వసతుల్ని, సేవల్ని అందించటంలో విఫలమవుతోందన్నారు. ప్రతిపక్షాలు లేకుండా చేయటం కన్నా ప్రజాసమస్యలు లేకుండా చేయటం ముఖ్యమన్నారు. అల్లాపూర్ డివిజన్ పర్వతనగర్‌లో నీటిసమస్యను పరిష్కరించాలంటూ లోక్‌సత్తా కార్యాలయం వద్ద పార్టీ నేతలు, మహిళలు నిరసన వ్యక్తం చేశారు. పర్వతనగర్, జనప్రియ నగర్‌లో నీటికి కటకటలాడుతుంటే, ప్రధాన రహదారిపై వాల్వు లీకేజీతో మంచినీరు వృధాగా రోడ్డు మీద పారినా అధికారులు పట్టించుకోలేదని వంశీ ప్రసాద్ అన్నారు. గెలిచాక ఏడాదిలో హైదరాబాద్ సమస్యలు పరిష్కరిస్తామని 2014లో, ఆతర్వాత జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ చెప్పారని, తాగునీరు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని అన్నారు.



### పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం

తన పుట్టినరోజు, ఉగాది సందర్భంగా వంశీప్రసాద్ పర్వతనగర్ పారిశుధ్య కార్మికులను సత్కరించి నూతన దుస్తులను అందజేశారు. ఇదేదో ప్రధానమంత్రిలా ఎన్నికల జిమ్మిక్కుగా చేసిన సన్మానం కాదని.. లోక్‌సత్తా భావజాలంలో స్థానిక ప్రభుత్వాలకు, వార్డు పాలనకు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వంటి రోజువారీ సేవలకు ఎంతో ప్రాధాన్యం ఉంటుందని అన్నారు. పారిశుధ్య కార్మికులకు జీతాలు ఎగ్గొడుతూ వేధిస్తుంటే, జేపీ కూకట్‌పల్లి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వారి పేరన బ్యాంకు ఖాతాలు తెరిపించి పక్కాగా అందేలా చేశారన్నారు. వారికి ఇతర సదుపాయాలు కూడా వర్తించేలా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. సుబ్రహ్మణ్యం, తిరుపతి రావు, నానాజీ, ప్రకాష్, రవి, నరేష్, చిరంజీవి, శ్రీరాములు, ధర్మారావు, మోహన్‌కృష్ణ, శివ, జగన్, పోసిదేవి, దానేశ్వరి, బాలకృష్ణ, చందు, శంకర్, గంగపుత్ర, సీతక్క బ్రహ్మ, జ్ఞానేశ్వరరావు, అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

# (మీడియాలో) 'కీ' కామెంట్లు!

◎ సంపద మాత్రమే సంతోషాన్ని తేలేదని ఆర్థికవేత్తలు గుర్తించారు. విద్య, ఆరోగ్యం, భద్రత, ఉపాధి కల్పన, సమానత్వం, మెరుగైన మౌలిక వసతులతో కూడిన నగరాలే హ్యాపీ సిటీస్ అవుతాయి.

– చార్లెస్ మోంట్‌గొమెరి, 'హ్యాపీ సిటీ' గ్రంథ రచయిత

◎ సమర్థ నాయకత్వం, దీర్ఘకాలిక ప్రణాళికలు, భద్రత, సకాలంలో పౌరసేవలు, ప్రజల్లో సాధికారత.. ఈ ఐదు సూత్రాల అమలుతోనే నగరాల్లో ప్రజలు సంతోషంగా జీవించగలరు.

– ఐషా బిన్ బిషర్, 'స్మార్ట్ దుబాయి' డైరెక్టర్ జనరల్

◎ వార్త పవిత్రమైనది- నిఖార్సయిన పాత్రికేయానికి ప్రాణప్రదమైన సూక్తి అది. 'నాకు నచ్చిందే వార్త- వీలైనంత మసాలా జోడించి జనం మీదకు వదుల్తా' అనే ప్రబుద్ధుల చేతిలో సామాజిక మాధ్యమం, అక్షరాలా పిచ్చివాడి చేతిలో రాయిలా మారింది. నిజమేమిటో పరిశీలించి నిర్ధారించుకునే తీరికలేని జనం బలహీనతలపై ఆడుకుంటూ, సామూహిక భావోద్వేగాలు రెచ్చగొడుతూ కొందరు నేరగాళ్లు చేస్తున్న సామాజిక మాధ్యమ దుర్వినియోగం వల్ల కొన్ని రాష్ట్రాల్లో కిరాతక హత్యలూ నమోదయ్యాయి. ప్రస్తుతం నడుస్తున్న సార్వత్రిక ఎన్నికల వేళ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారాన్ని ముమ్మరం చేసిన పార్టీల పక్షాన యువజన అక్షౌహిణులు అక్షరాలా యుద్ధమే చేస్తున్నాయి. రాజకీయ ప్రత్యర్థుల పరువును బజారుకీడ్చడమే లక్ష్యంగా సాగుతున్న ఈ వికృత కళాకేళి దిగ్భ్రాంతిపరుస్తోంది! అసత్యాలు, అర్థసత్యాల కలబోతగా నకిలీ వార్తలను వండివార్చి జనాభిప్రాయాన్ని తమకు అనుకూలంగా కూడగట్టే దుర్రాజకీయ లక్ష్యంతో పార్టీలన్నీ పెద్దయెత్తున సాంకేతిక సైన్యాల్నే మోహరించాయి. స్మార్టుఫోన్లు అసత్య ప్రచార వాహకాలుగా సృష్టిస్తున్న సామాజిక రాజకీయ అరాచకం- ఆలోచనాపరుల్ని కలచి వేస్తోంది! అసత్య వార్తల మేజువాణి ఇండియాలోనే అత్యధికమని మైక్రోసాఫ్ట్ అధ్యయనం మొన్న ఫిబ్రవరిలో తేల్చింది. అంతర్జాలం ద్వారా నకిలీ వార్తల తుపాను ఏ తీరుగా ఉందో 22 దేశాల్లో అధ్యయనం చేసిన సంస్థ- ప్రపంచవ్యాప్తంగా 57 శాతం మంది దాని పాలబడితే, ఇండియాలో పాల్లు సమాచార స్వీకర్తలు 64 శాతంగా ఉన్నట్లు పేర్కొంది. ఎన్నికల యుద్ధం గెలవడానికి ఏం చేసినా తప్పు కాదన్నట్లున్న రాజకీయ పక్షాల ధోరణి పెనుముప్పు తెచ్చిపెడుతోంది. నేతల విశ్వసనీయత ఇప్పటికే ప్రశ్నార్థకమైంది. ఎన్నికల పట్ల, ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల జనం నమ్మకం నీరుగారిపోతే- దేశం ఏరకంగా పురోగమిస్తుంది? ఆలోచించండి!

- పర్వతం మూర్తి

◎ ఆరోగ్యకరమైన యువత ఉన్న దేశంగా చైనా ప్రసిద్ధి చెందింది. సార్వజనీన విద్య, వైద్యంతోనే ఇది సాధ్యమైంది. మనదేశంలోనూ అటువంటి విధానాలు తీసుకువస్తే అద్భుతాలు చేయవచ్చు. శాస్త్రసాంకేతిక రంగాల్లో తిరుగులేని శక్తిగా ఎదుగుతున్న చైనాను అందుకోవాలంటే ఏం చేయాలనే దిశగా మన ప్రభుత్వాలు ఆలోచనలు చేయాలి.

– రవి భూతలింగం, చరిత్రకారులు, రచయిత

◎ భారత రాజకీయాలు పాకిస్తాన్ అంతర్గత వ్యవహారాలుగా మారే పరిస్థితి వస్తుందని ఆరోజు మేం అస్సలు ఊహించలేకపోయాం. నరేంద్రమోదీ, బీజేపీ రెండోసారి అధికారంలోకి వస్తే పాకిస్తాన్‌కు మేలు చేకూరుతుందని, కశ్మీర్ సమస్యకు ఉత్తమ పరిష్కారం లభించవచ్చని ఇమ్రాన్ ఖాన్ చేసిన ప్రకటనను మనం ఇలాగే అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. భారతీయ ఎన్నికల ఫలితంపై ఇంత స్పష్టంగా తన వైఖరిని గతంలో ఏ పాక్ ప్రధాని అయినా ప్రదర్శించింది లేనిదీ గుర్తుచేసుకోవడం కష్టమే. దేశ రాజకీయాల్లో పాకిస్తాన్‌కు ప్రాధాన్యత ఇవ్వడంలో పీవీ నరసింహారావు చాలా తెలివిగా

ఉండేవారు. ఇప్పుడు భారత రాజకీయాలు పాకిస్తాన్ అంతర్గత వ్యవహారాలుగా కనిపిస్తున్నాయి. మన దేశీయ రాజకీయాల్లో పాకిస్తాన్ బహిరంగ జోక్యం పట్ల ఎలా ప్రతిస్పందించాలో మోదీ ప్రభుత్వానికి తెలియడం లేదు. దేశ ఆర్థిక వ్యవస్థ, ఉద్యోగాల కల్పన, దేశాభివృద్ధి వంటి అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టిని పాకిస్తాన్, ఉగ్రవాదం, ముస్లింల వైపు మళ్లించడానికి కేంద్ర ప్రభుత్వానికి నెలల సమయం పట్టింది. ఎంత సుదీర్ఘకాలం కొనసాగినా సరే.. నిర్ణయాత్మక యుద్ధం చేయడం ద్వారా పాక్‌కు గుణపాఠం చెబుతామనే హామీ ద్వారా మళ్లీ గద్దెనెక్కాలని మోదీ ప్రభుత్వం చూస్తోంది. మనం ఇప్పటికే చేసిన వ్యూహాత్మక ఘోరతప్పిదాన్ని చూడలేకపోవడం అనే బాధాకరమైన వాస్తవం నుంచి మనల్ని మనం దాచిపెట్టుకుంటున్నాం. ఆ తప్పిదం ఏమిటి? మన శత్రువును దేశీయంగా ప్రజలను వేరు చేసే అంశంగా మల్చడం, మన అంతర్గత వ్యవహారాల్లో వారికి చోటు కల్పించడం

– శేఖర్ గుప్తా, ద ప్రింట్ ఛైర్మన్, ఎడిటర్-ఇన్-చీఫ్

◎ గ్రామ పంచాయతీ, మునిసిపల్, కార్పొరేషన్, రెవెన్యూ శాఖలలో అవినీతి ఎంతగా పేరుకు పోయిందంటే, అసలు లంచం లేకుండా ఏ చిన్న పనీ జరుగడం లేదన్నది నిజం. చాలా ఆశ్చర్యంగా ఉద్యోగులకు పెద్దఎత్తున జీతాలు పెరిగినా ఈ రుగ్మత అదే పనిగా ఇంకా కొనసాగుతుండటం. పైవే కాదు, రవాణా, పోలీస్, విద్యుత్, అబ్కారీ, రోడ్లు భవనాలు, విద్య, వైద్య ఆరోగ్యం తదితర అన్ని శాఖల్లోనూ అవినీతి ఇవాళ విచ్చలవిడి అయ్యింది. ఆఖరికి న్యాయ, సేవ, పత్రికా రంగాలకు సైతం ఈ డబ్బు జబ్బు వ్యాపించడం బాధాకరం. ప్రజాస్వామ్యానికే ఇదొక పెద్ద చీడపురుగులా, చెదలుగా పరిణమించింది. ఏడు దశాబ్దాల స్వాతంత్ర్య భారత చరిత్రలో దేశ ప్రగతి గుణాత్మక మార్పునకు నోచుకోకపోగా, యావత్ ప్రపంచ దేశాల ముందు మన ఘనమైన ప్రజాస్వామ్య వ్యవస్థలు అపహాస్యం పాలైన దీనదుస్థితికి ప్రధాన కారణాల్లో ఒకటి అవినీతి. 'ప్రజలకు మంచిసేవ చేయడంకన్నా గొప్ప బాధ్యతలు మనకేం ఉంటాయి? ఎవరికీ ఎక్కడా ఒక్క రూపాయి కూడా లంచం ఇవ్వకుండా పనులు జరిగే పరిస్థితులను సృష్టిద్దాం' అన్న మన తెలంగాణ ముఖ్యమంత్రి ఆలోచనా పంథాను ప్రజలందరం, ప్రత్యేకించి ఉద్యోగులంతా అందిపుచ్చుకోవాలి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొట్టమొదటిసారిగా ఒక ముఖ్యమంత్రి నోటివెంట అత్యుత్తమమైన, ఉదాత్తమైన మాటలను ఇటీవల విన్నాం. ఇటువంటి ఉత్తమ వ్యవస్థల నిర్మాణం జరిగినప్పుడే ప్రజాస్వామ్యానికి నిజమైన అర్థం లభిస్తుంది. అప్పుడే మనమంతా కలలు గంటున్న బంగారు తెలంగాణకు బాట పడుతుంది.

- దోర్బల బాలశేఖరశర్మ

◎ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ ఏడాది మార్చి వరకు మొత్తం **59** దేశాలను **41** సార్లు సందర్శించినా మన ఎగుమతులను పెంచలేకపోయారు. **2017**లో ప్రపంచ దేశాలు జరిపిన ఎగుమతుల్లో భారత్ వాటా **1.7** శాతం మాత్రమే. ఎగుమతిదారుల జాబితాలో భారత్ **20**వ స్థానంతో సరిపెట్టుకోవలసి వచ్చింది. మొదటి అయిదు ర్యాంకులను చైనా **(12.8** శాతం), అమెరికా **(8.7)**, జర్మనీ **(8.2)**, జపాన్ **(3.9)**, నెదర్లాండ్స్ **(3.7** శాతం) ఆక్రమించాయి. భారత్ ఎగుమతులు-స్థూల దేశీయోత్పత్తి మధ్య నిష్పత్తి అంతరం గత **14** ఏళ్లలో ఎన్నడూలేనంత తక్కువకు **(11.6** శాతానికి) తగ్గిపోయింది. సాటి ఆసియా దేశాల ఎగుమతులు పెరుగుతుండగా, భారతదేశం వాటిని అందుకోలేకపోవడం విచారకరం. పరిశ్రమలను నిలబెట్టి, ఎగుమతులను పెంచితే ఉపాధి అవకాశాలు ఇతోధికమవుతాయి.

– వి.బి.ఎస్.ఎస్ కోటేశ్వరరావు, ఎగుమతి-దిగుమతి రంగ నిపుణులు

◎ భారత జాతీయ పోరాటం అహింసతో కూడినదని నాటి నాయకులు విశ్వసించినప్పటికీ దాని వెనుక ఒక హింసాత్మక ప్రతిఘటన దాగి ఉంది. ఆ భావన ప్రజల్లోకి విస్తరిస్తే ప్రమాదమని గాంధీజీ ఒక్కరే గుర్తించారు. 'హింసకు హింస మార్గం కాకూడదని' ఆయన చెప్పారు. ఆయనకపెంపొందించిన ఈ ఆలోచనే గాంధీ శక్తిగా, కాలక్రమంలో భారతదేశ శక్తిగా మారింది. గాంధీజీ విఫలం కాలేదు. 'గాంధీ మార్గం తప్ప వేరే మార్గం లేదు' అనే నిజాన్ని ప్రపంచమే గుర్తిస్తోంది.

– సుధీర్ చంద్ర, ప్రముఖ చరిత్రకారులు

(కర్టెసీ: ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, నమస్తే తెలంగాణ, సోషల్ మీడియా) *

# భవిష్యత్ తారలను తయారుచేసేదే నిజమైన విద్య: జేపీ








సమాజాన్ని సరైన మార్గంలో నడిపించేదే చదువు.. సమాజానికి ఉపయోగపడుతూ సంపదను అందించేదే ఉపాధి అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

ఖమ్మంలో వైబ్రెంట్స్ ఆఫ్ కలాం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన ఉద్యోగ నైపుణ్య శిక్షణా కేంద్రం 'కలాం విజన్ సెంటర్'ను జేపీ ప్రారంభించారు. తొలుత ఏపీజే అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అనంతరం భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. ప్రస్తుతం పిల్లలు అభ్యసిస్తున్నది ఉత్తుత్తి చదువులని జేపీ అన్నారు. ఈ చదువులతో సర్టిఫికెట్లు తప్ప ఉపాధి లభించదని, సమాజం ఎదగదని అన్నారు. సమాజంలోని అవసరాలు తీర్చే విధంగా నైపుణ్యం పొందాలన్నారు. ప్రభుత్వాలు ప్రజల నుంచి పన్నుల రూపంలో డబ్బు తీసుకుని ఉచితాలు, తాయిలాలకు, వేతనాలకు, ఆడంబరాలకు ఖర్చు చేస్తున్నాయన్నారు. ఇదే డబ్బుని సరైన విధానాలతో సద్వినియోగం చేస్తే అందరికీ మేలు జరుగుతుందని, ఎదిగే అవకాశాలు లభిస్తాయని అన్నారు. ప్రభుత్వాలు మౌలిక వసతుల్ని కల్పించాలని, రోడ్లు వేయటం వంటి బాధ్యతల్ని నెరవేరిస్తే యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ఉపాధి నైపుణ్యాలకు కీలకమైన నాణ్యమైన పాఠశాల విద్యను దేశవ్యాప్తంగా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. 8వ తరగతి విద్యార్థులకు చూసి చదవటం రాదని సర్వేలు చెబుతున్నాయన్నారు. తెలంగాణలో 14-18 ఏళ్ల పిల్లల్లో పలువురికి గడియారం చూసి సమయం చెప్పటం కూడా తెలియదన్నారు. మౌలిక వసతులు, నాణ్యమైన విద్యకు తోడు చట్టబద్ధపాలన ఉంటే పరిశ్రమలు, ఇతర రూపాల్లో ఉపాధి అవకాశాలు వేగంగా పెరుగుతాయన్నారు. దేశంలోని జైళ్లలో 75 శాతం మంది విచారణ ఖైదీలు మగ్గుతున్నారన్నారు. కేవలం పేదరికం వల్లే వీరు బయటికి రాలేకపోతున్నారన్నారు. మరోవైపు, హత్యలు, దోపిడీలు వంటి తీవ్రమైన నేరాలు చేసిన వారు నాయకులుగా చెలామణి అవుతున్నారన్నారు. పాలకుల పాపం వల్లే నిరుద్యోగం పెరుగుతోందన్నారు. నిరుద్యోగ భృతి వంటి తాయిలాలతో ఆ పాపాన్ని కడుక్కోలేరన్నారు.

సమాజాన్ని మార్చే సత్తాని అందించే చదువుల్ని అభ్యసించాలని, పరిశోధనా దృష్టితో ముందుకెళ్లాలని విద్యార్థులు, యువతకు జేపీ విజ్ఞప్తి చేశారు. భవిష్యత్ తారలను తయారుచేసేదే నిజమైన విద్య అన్నారు. సమాజాన్ని మార్చే ప్రాక్టికల్ థింకింగ్ ఈవేళ మరీ ఎక్కువ అవసరమన్నారు. సమాజాన్ని మెరుగుపరచటం కూడా సంపదసృష్టిలో భాగమన్నారు. నేటి రాజకీయ వ్యవస్థ, ఉద్యోగ వ్యవస్థలోని









లోపాల్ని జేపీ సవివరంగా తెలియజేస్తూ, వీటిని మార్చటంలో భాగస్వాములవ్వాలంటే కనీస అవగాహన ఉండాలన్నారు. చుట్టూ వేగంగా వస్తున్న మార్పుల్ని అవగతం చేసుకుంటూ ఎప్పటికప్పుడు ప్రతీ విషయం పట్ల సమగ్రమైన అవగాహనతో స్పందించటాన్ని సామాజిక మాధ్యమాల యుగంలో యువత అలవరచుకోవాలన్నారు. యువత నూతన దృక్పథాన్ని అలవరచుకోవటానికి కలాం విజన్ సెంటర్స్ వంటివి ఎంతో అవసరమన్నారు. కొత్త ఆలోచనలతో యువత క్రియాశీలంగా ముందుకు సాగేందుకు వైబ్రెంట్స్ ఆఫ్ కలాం సంస్థ కృషి చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, యువత, పలు రంగాలకు చెందిన వ్యక్తులు అడిగిన ప్రశ్నలకు జేపీ వివరంగా సమాధానం చెప్పారు. దేశంలో ప్రతి ఒక్కరికీ సమానావకాశాలు లభించడమే నిజమైన జాతీయత అవుతుందన్నారు. ప్రతి ఒక్కరి ఆత్మగౌరవాన్ని కాపాడటం, మానవ విలువల్ని పరిరక్షించడం నిజమైన జాతీయవాదమన్నారు. జాతీయవాదమంటే పాక్, చైనాలను ద్వేషించటం కాదన్నారు. దీన్ని ఏనాడూ కులానికో, మతానికో, ప్రాంతానికో ఆపాదించడం ద్వారా మనల్ని మనం కించపరచు కోవటం తగదన్నారు. చట్టాలను గౌరవిస్తూ నిజాయతీగా వ్యాపారం చేసి సంపదను సృష్టించాలన్నారు.

దేశంలో మంచి మార్పులు రావాలన్నా, అభివృద్ధి చెందాలన్నా.. ముఖ్యమైన రాజకీయ రంగం మారాలని హార్వెస్ట్ విద్యాసంస్థల ఛైర్మన్ రవిమారుత్ అన్నారు. ఎందరో విద్యార్థులు ఉన్నత చదువుల డిగ్రీలు పొందుతున్నప్పటికీ ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు లేక నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని, పదో తరగతి నుంచి పీజీ వరకు వారి చదువులకు అనుగుణంగా ప్రత్యేక శిక్షకుల ఆధ్వర్యంలో తీర్చిదిద్ది అత్యుత్తమ వేతనం అందించేలా అవకాశాలు కల్పించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు విజయ్ కలాం తెలిపారు.

అనంతరం వైబ్రెంట్స్ ఆఫ్ కలాం కార్యక్రమాలను ప్రదర్శించారు. గ్రామీణ విద్యార్థులను తీర్చిదిద్ది ఉద్యోగావకాశాల్ని కల్పించిన రైట్ ఛాయిస్ ఐఏఎస్ అకాడమీ ఛైర్మన్ మెండెం కిరణ్ కుమార్‌ను ప్రత్యేకంగా సన్మానించారు. ధాత్రి భరతనాట్యం ప్రత్యేక ఆకర్షణగా అలరించింది.

కార్యక్రమంలో ఇంగ్లీష్ ట్రైనర్ అరుణ్, కిరణ్ సత్యమూర్తి, అగ్రికేర్ ఎండీ రవికుమార్, శ్రీను, సుధీర్, రాజ్‌కుమార్, భాస్కర్, విజయ్, పవన్, సాయి, సైదులు, హర్ష, రామకృష్ణ, నవీన్, హేమలత, న్యాయవాది వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. *




# కులం పేరుతో ప్రధాని ప్రచారమా?

" ప్రధాని మోదీ కులం పేరుతోచేస్తున్న ఎన్నికల ప్రచారం దేశానికి మంచిది కాదు. ఒక సభలో మతం, మరో చోట కులం, ఇంకో దగ్గర ప్రాంతం పేరుతో ప్రజలను రెచ్చగొట్టేందుకు చేసే ప్రయత్నం ఆయన  స్థాయికి తగదు. నాకు తెలిసి ప్రధాని హోదాలో ఉన్న వ్యక్తులెవరూ ఇలా మాట్లాడలేదు. ఎన్నికల్లో గెలిచేందుకు ఏ అస్త్రాన్నయినా ఉపయోగించొచ్చు అనే రకంగా వ్యవహరించటం దేశ సమగ్రతకు తూట్లు పొడవటమే!"

- లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్

# ప్రైవేటు ధనం. ప్రభుత్వ ఉచితాల మధ్యే ఎన్నికల పోరు

"ప్రైవేటు సొమ్మును సమర్థవంతంగా ఓటర్లకు పంపిణీ చేయటం, ప్రజాధనాన్ని ఉచిత కానుకల రూపంలో అందించటం మధ్యే ఆంధ్రప్రదేశ్ ఎన్నికల పోరు జరిగింది. ఎన్నికల్లో ఎవరు గెలిచినా... ప్రజాస్వామ్యం ఆత్మను కోల్పోయింది. ఇదొక సంక్షోభం.

- జేపీ

Posting Date 07-05-2019
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2019-21 Published on May 1st, 2019




# సామాజిక న్యాయానికి ఐదు : జేపీ

సామాజిక న్యాయం అంటే మొక్కుబడిగా రిజర్వేషన్ల గురించి, దళితుల గురించి మాట్లాడటం కాదని... పుట్టుకతో వివక్షను తొలగించి సమానంగా ఎదిగే అవకాశాలనిచ్చే నిర్దిష్ట రాజకీయ, పాలనా మార్పులను లేవనెత్తటం, వాటి కోసం పనిచేయటమని ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ్ అన్నారు. రాజ్యాంగ పీఠికలోనే ఈ దిశానిర్దేశాన్ని పొందుపరిచారన్నారు. మన సమాజంలో కిందివర్గాల వారికి తిండిపెట్టటం, వారిని ఆదరంగా చూడటం వంటివి చేస్తారని.. కానీ కిందిస్థాయి వారి బిడ్డలు పైకి ఎదగటానికి కావలసిన మంచి చదువును అందించటానికి మాత్రం ఇష్టపడరని అన్నారు. కులప్రభావాన్ని తొలగించటంలో ప్రధాన పాత్ర వహించే నాణ్యమైన విద్యను ప్రతి బిడ్డకూ అందించటం గురించి తాజా ఎన్నికల్లో తెలుగు రాష్ట్రాల్లోనూ , జాతీయ స్థాయిలోనూ ఒక్క ప్రధాన పార్టీ కూడా మాట్లాడలేదని, పైకి మాత్రం సామాజిక న్యాయం అందిస్తామని నటిస్తున్నారన్నారు. స్వాతంత్ర్యం వచ్చి డెబ్బై ఏళ్లు దాటినా ఈ దేశంలో పిల్లలకు నాణ్యమైన చదువు అందించాలన్న ఇంగితజ్ఞానం, పాపభీతి వామపక్షాలు, దళిత పక్షాలు సహా రాజకీయ పార్టీలకు ఎందుకు కలగలేదు అన్నది దిగ్భ్రాంతిని, వేదనను కలిగించే ప్రశ్న అన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్‌ల జయంతి సందర్భంగా హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ఓయూ ఎస్.సి, ఎస్.టి. సెల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 'రాజ్యాంగ ప్రజాస్వామ్యం - సామాజిక న్యాయం'పై జేపీ కీలకోపన్యాసం చేశారు. అణచివేత మామూలే అనే కుల మనస్తత్వాన్ని తొలగించి అందరికీ ఎదిగే అవకాశాలనిచ్చేందుకు ఐదు సూత్రాలను జేపీ ప్రతిపాదించారు. 1) ప్రజలకు తాగునీరు, ధ్రువపత్రాలు, నల్లా, విద్యుత్తు కనెక్షన్, పట్టాదారు పాసుపుస్తకం వంటి కనీస పౌర సేవల్ని లంచాల్లేకుండా అందించే పక్కా ఏర్పాటు 2) చట్టబద్ధపాలన 3) అందరికీ ఖర్చు లేకుండా నాణ్యమైన విద్య, ఆరోగ్యం 4) అధికారాన్ని వికేంద్రీకరించి స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, విధుల్ని ఇవ్వటం 5) ప్రతి ఒక్కరికీ ఓటుకు - తన జీవితానికి మధ్య సంబంధం అర్థమయ్యేలా చేసే రాజకీయ, ఎన్నికల సంస్కరణలు... ఈ ఐదింటి ద్వారా అణగారిన వర్గాల విముక్తి జరిగి సామాజిక న్యాయం సాధ్యమవుతుందన్నారు. సదస్సుకు కన్వీనర్ గాలి వినోద్ కుమార్ అధ్యక్షత వహించారు. జాతీయ ఓబీసి కమిషన్ మాజీ ఛైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య ముఖ్య అతిథిగా, జాతీయ ఎస్.సి కమిషన్ సభ్యుడు రాములు గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఓయూలో అంబేద్కర్ పరిశోధనా కేంద్రాన్ని మే 9న ప్రారంభిస్తున్నట్లు వైస్ ఛాన్సలర్ ప్రొ.రామచంద్రం తెలిపారు. గ్రంథాలయం పేరును బీఆర్ అంబేద్కర్ లైబ్రరీగా నామకరణం చేస్తున్నట్లు చెప్పారు. యూజీసీ డీన్.ప్రొ.శివరాజ్, ఓయూ అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు. 'రాజ్యాంగ ప్రజాస్వామ్యం - సామాజిక న్యాయం' పై జయప్రకాష్ నారాయణ్ ప్రసంగ పాఠాన్ని బుక్‌లెట్ రూపంలో ప్రచురించి ఈ సందర్భంగా విడుదల చేశారు. (జేపీ కీలకోపన్యాసం పూర్తిపాఠం లోక్‌సత్తా టైమ్స్ వచ్చే సంచికల్లో).

Book-Post

PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

To

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad